

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 6 నవంబరు 2024



ఎక్సైజ్ శాఖలో కొందరు ఉన్నతాధికారులు కరువులో ఉన్నట్టున్నారు. ఐదేళ్ల ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మామూళ్లు అందక అల్లాడిపోయిన ప్రభావమో.. అప్పటి నష్టాన్ని ఇప్పుడు పూడ్చుకోవాలనే తాపత్రయమో ఏమోగానీ ప్రైవేటు మద్యం వ్యాపారుల మీద పడుతున్నారు. ఇంకా షాపులు తెరిచీ తెరవకముందే 'మా మామూళ్లు మాకిచ్చేయండి.' అంటూ వెంటపడుతున్నారు. సర్కిళ్ల స్థాయిలో సమావేశాలు పెట్టి పర్మినెంట్ లైసెన్సు ఇచ్చినందుకు ఎక్సైజ్ అధికారుల పర్సనల్ పన్ను కింద ఒక్కో షాపునకు రూ.లక్ష కట్టాలని రేటు ఫిక్స్ చేశారు. ఈ షాక్ నుంచి వ్యాపారులు తేరుకోకముందే "ఇచ్చేయండి.. ఇచ్చేయండి... ఖర్చులకు కూడా ఏమీ లేదు. ఐదేళ్లుగా పస్తులున్నాం.." అంటూ ఒత్తిడి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల ఇతర ప్రభుత్వ శాఖల మాట ఎలా ఉన్నా ఎక్సైజ్ శాఖ మాత్రం 'ఫుల్లు' హ్యాపీగా ఉందనడానికి తెరపైకి వచ్చిన ఈ మామూళ్ల ఫిక్సేషనే నిదర్శనం.

నెల్లూరులో రూ.10లకే ఆర్టీసీ ప్రయాణం | ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్ 4

షాపునకు రూ.లక్ష!



• రేటు ఫిక్స్ చేసిన ఎక్సైజ్ అధికారులు

- లైసెన్స్ ఇవ్వాలంటే తప్పదు మరి
- రూ.2కోట్ల సంపాదనకు అధికారుల స్కెచ్
- సమావేశం పెట్టి మరీ ఆదేశాలు జారీ
- అంత ఇచ్చుకోలేమంటూ వ్యాపారుల వేడుకోలు
- కొనసాగుతున్న బేరసారాలు.. నేడో రేపో తుది నిర్ణయం

నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో ప్రత్యేకించి కొన్నింటికి చాలా డిమాండ్ ఉంటుంది. ఆ శాఖల్లో అటెండరుగా అయినా సరే బతకడానికి చాలా మంది ఉబలాటపడతారనేది నానుడి. అలాంటి కొన్ని శాఖల్లో ఎక్సైజ్ ఒకటి. ఈ శాఖలో ఉద్యోగం లభిస్తే ఇక డబ్బులే డబ్బులు. ఇంతటి ఘన కీర్తి కలిగిన ఈ శాఖ గత ఐదేళ్లుగా చాలా కష్టపడిపోయింది. మద్యం వ్యాపారం పేరుతో కొంతమంది, మామూళ్ల పేరుతో కొంతమంది తినడం ఏమిటి!? మొత్తం మేమే తింటాం!? అనే చందంగా వైసీపీ పాలకులు కొత్త ఎక్సైజ్ విధానం పేరుతో ప్రభుత్వ మద్యం దుకాణాలను తెరిచారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో తెలివిగా దోపిడీ చేశారు. దీంతో పాపం ఎంతో వైభవంగా బతికిన ఎక్సైజ్ శాఖకు పైసా కూడా అదనపు ఆదాయం లేకుండా పోయింది. గడిచిన ఐదేళ్ల ఇలా జీతం తప్ప గీతం ఎరుగని కరువు కాలాన్ని ఎదుర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మద్యంప్రియులకు కాసింత మంచి మందు లభించేలా చేయాలని, ఈ వ్యాపారంతో పది మందికి జీవనోపాధి లభించాలనే విశాల దృక్పథంతో పాత మద్యం విధానాన్ని తీసుకొచ్చింది. ఇది ఎక్సైజ్ శాఖ అధికారుల్లో ఆశలు పెంచింది. వైసీపీ పాలనలో మామూళ్ల రూపంలో ఎంత నష్టపోయారో లెక్కలేసుకొని, ఆ మొత్తాన్ని కూటమి పాలనలో వసూలు చేసుకోవాలని నిశ్చయానికి వచ్చినట్టు ఉన్నారు. ఆ క్రమంలోనే మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సు పేపరు చేతికి ఇవ్వాలంటే ఒక్కో షాపునకు లక్ష రూపాయల చొప్పున మామూళ్లు ఇవ్వాలని షాపు యజమానులకు రేటు ఫిక్స్ చేశారు.

• సర్కిల్ అధికారులకు బాధ్యతలు

సర్కిల్ స్థాయి అధికారులకు వసూళ్ల బాధ్యతను అప్పగించారు. వారు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగారు. తమ పరిధిలోని షాపు యజమానులను సమావేశపరిచి లైసెన్సుకు ఫిక్స్ చేసిన రేటు గురించి చెప్పారు. జిల్లాలో మొత్తం 182 షాపులు ఉన్నాయి. ఒక్కోదానికి రూ.లక్ష చొప్పున 1.82 కోట్ల రూపాయలకు స్కెచ్ వేశారు. ఈ స్థాయిలో మామూళ్లు ఇవ్వమని చెప్పే సాహసం చేయలేక వ్యాపారులు నలిగిపోతున్నారు. వాస్తవానికి వీరికున్న బాధలు వీరికున్నాయి. సువిశాల జిల్లాలో షాపు పెట్టుకోవడానికి పది అంకణాల స్థలం దొరక్క అల్లాడుతున్న మద్యం వ్యాపారులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పది రూపాయల వ్యాపారం జరిగే ప్రాంతాలను కొందరు అధికార పార్టీ నాయకులు కైవసం చేసుకొని తమకు చెందినవారి షాపులను మాత్రమే పెట్టుకోనిస్తున్నారు. నచ్చినచోట షాపు పెట్టుకునేలా ప్రభుత్వం చట్టం చేసినా దాన్ని అమలు చేయగలిగే సత్తా ఎక్సైజ్ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఉండటం లేదు. అధికారానికి ఎదురు వెళ్లాలంటే చట్టం వణికిపోతోంది, కానీ మామూళ్లకు మాత్రం ఎగనెత్తుకొని వచ్చేస్తున్నారు సార్.. అంటూ మద్యం వ్యాపారులు వాపోతున్నారు. ఏది ఏమైతేనేం.. ఎవరు ఏమైతేనేం... ఎక్సైజ్ శాఖ మామూళ్లు మాత్రం పక్కా!? ఒకవేళ రేటు పది రూపాయలు అటు ఇటో తేడా ఉండవచ్చు కానీ ఎక్సైజ్ శాఖ తోటలో మామూళ్ల పంట పండటం మాత్రం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి.

తీరనున్న ఆకాంక్ష!

- నేడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో 615 పోస్టుల భర్తీ

నెల్లూరు (విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో నిరుద్యోగుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే టెట్ ఫలితాలు విడుదలవగా, బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ డీఎస్సీలో కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనతో లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు. వీరంతా కూడా

- మిగతా 4లో..

నాగేంద్రాయ నమః



నెల్లూరు : ధర్మరాజుల ఆలయంలో నాగుల విగ్రహాన్ని పాలతో అభిషేకిస్తున్న భక్తులు

నాగులచవితి పర్వదినాన్ని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయాన్నే ఆలయాలు, చెరువు గట్లు, పొలాల గట్ల వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. నియమ నిష్టలతో ఉపవాస దీక్షను ఆచరించి, నాగేంద్రస్వామిని పూజించారు.

ఒక్క పనీ చేయలేదు మోసగాళ్లుగా చూస్తున్నారు!

'ప్రజలు అడిగిన ఒక్క పని కూడా చేయలేకున్నాము, డివిజన్లలో మాకు కనీస గౌరవం లేదు, మోసగాళ్లను చూసినట్లు చూస్తున్నారు. ప్రతీ కౌన్సిల్లో గొంతెత్తి అరవడం తప్ప మా గోడు పట్టించుకోవడం లేదు. అధికారులకు కార్పొరేటర్లంటే లెక్కేలేదు. పారిశుధ్యంపై ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారు.' అంటూ నెల్లూరు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వాపోయారు. కొందరు కార్పొరేటర్లు అధికారుల తీరును తూర్పారబట్టారు. ప్రతీ మూడు నెలలకోసారి జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని 11 నెలల తర్వాత నిర్వహించడం సబబుకాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

- కార్పొరేటర్లమనే గౌరవం లేదు
- నగర పాలికలో గళమెత్తిన సభ్యులు
- పారిశుధ్యలేమిపై మండిపాటు
- 64 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

నెల్లూరు(సిటీ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ పోట్లూరి స్రవంతి అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాల యంలో మంగళవారం జరిగింది. తమ డివిజన్లలో స్థానిక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయంటూ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటీ నియోజకవర్గానికి చెందిన 11వ డివిజన్ కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ తమను డివిజన్లలో ప్రజలు గౌరవించడం మానేశారని, వాళ్లు అడిగిన ఏ ఒక్క పనీ మేము చేయలేకపోతుండటంతో మోసగాళ్లుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 3వ డివిజన్ కార్పొరేటర్ అశ్విని మాట్లాడుతూ ఒక్క సమస్యకూడా పరిష్కారం కాకపోవ డంతో చెప్పిన సమస్యలే మళ్లీ చెప్పాల్సి వస్తోంద న్నారు. కార్పొరేటర్‌తో సంబంధం లేకుండానే డివిజన్‌లో అన్నీ పనులు చేసేసుకుంటు న్నారని, ఇలాగైతే ఇక తామెందుకని 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియా యంత్రాంగాన్ని ప్రశ్నించారు. చెత్తకుండీల్లేక రోడ్లపై చెత్త కుప్పలు పెరుగుతున్నా యని, నగరంలో ట్రాఫిక్‌ను పశువులు నియం త్రించే దుస్థితి దాపురించిందని కార్పొరేటర్ మహేష్ హేళన చేశారు. కిన్నెర మాల్యాద్రి, రవిచంద్ర, సత్తార్ మాట్లాడుతూ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దోమల బెడద తీవ్రమవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కర్తం



వైసీపీ సభ్యుల వాదనలు

టీడీపీ పేరు ప్రస్తావిస్తే ఊరుకోం : కర్తం

ఈ సమావేశంలో 13వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ నాగార్జున, 14వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మధ్య ఆసక్తికర వాదన జరిగింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 13వ డివిజన్‌లో టీడీపీ నాయకులు కాలువలు, ఖాళీ స్థలాలు ఆక్రమించుకుంటున్నారంటూ నాగార్జున పదే పదే పార్టీ పేరు ప్రస్తావించడంతో ప్రతాప్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. టీడీపీ పేరు ప్రస్తావిస్తే ఊరుకోమంటూ అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. వైసీపీ పాలనలో 13వ డివిజన్ వ్యాప్తంగా జరిగిన ఆక్రమణలపై విచారణ కమిటీ వేయాలని కర్తం డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నగర నియోజకవర్గానికి కార్పొరేషన్ నిధులు సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ సమయంలో అటు వైసీపీ కార్పొరేటర్లు, ఇటు టీడీపీ కార్పొరేటర్లు వాదనకు దిగడంతో వివాదం ముదిరింది. దీంతో మేయర్ సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. కాగా, కోఆప్షన్ సభ్యుడు, జనసేన నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్ సమావేశ మందిరంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు తీసుకుని రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ చిత్రపటాలను మందిరంలో ఏర్పాటు చేయాలని కోరగా ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు ఉన్నాయని అధికారులు బదులిచ్చారు.

ముత్తుకూరు మార్గంలో రాత్రుళ్లు రోడ్డుపైనే మార్కె ట్ పెడుతున్నారని, దీనివల్ల ప్రయా ణికులకు తీవ్ర ఇబ్బంది కలుగు తోందని 17వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్ ఫిర్యాదు చేశారు.

మూడేళ్లయినా స్టాండింగ్ కమిటీ ఏదీ?

కార్పొరేషన్ ప్రస్తుత పాలక మండలి ఏర్పడి మూడేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు స్టాండింగ్ కమిటీ ఏర్పాటు కాకపోవడం ఆశ్చర్య కరంగా ఉందని సభ్యులు విమర్శిం చారు. ఇప్పటికైనా స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కర్తం ప్రతాప్‌రెడ్డి, మొయిళ్ల గౌరీ పట్టుపట్టారు. ప్రతీ మూడు మాసాలకు జరపాల్సిన సర్వసభ్య సమావేశాన్ని 11 నెలల నుంచి జరపకపోవడాన్ని తప్పు పట్టారు. ఇక నుంచైనా త్రైమాసిక

- మిగతా 4లో

దాచూరులో అక్రమార్కుల బరితెగింపు

200 ఎకరాల ప్రభుత్వ భూమిపై కొందరి కళ్లు

ప్రభుత్వ భూమేగా.. ఆక్రమించేయ్!



ప్రభుత్వ భూమిని ఆక్రమించి నాటిన నిమ్మ చెట్లు

ప్రభుత్వ భూమేగా.. మమ్మల్ని అడిగేదెవరు.. ఆక్రమించేయ్.. అన్న రీతిలో కలువాయి మండలం దాచూరులో అక్రమార్కులు బరితెగించారు. ఏకంగా 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాహా చేసేందుకు కుట్రలు పన్నారు. ఇప్పటికే సుమారు 70 ఎకరాలు అక్రమార్కుల చెరలోకి వెళ్లిపోయింది. దాచూరు, పెరంకొండ, ముక్కతిప్ప గ్రామాలకు చెందిన పలువురు భూస్వాములు ఈ ఆక్రమణల వెనుక కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

4

కనకం కోసం కడతేర్చారు!

కాయగూరలు తీసుకువస్తానని వెళ్లిన వృద్ధురాలు మధ్యాహ్నం దాటినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాబరా పడ్డారు. ఎక్కడికి వెళ్లిందో నంటూ నెల్లూరు నగరమంతా గాలించారు. గంటలు గడిచినా వృద్ధురాలి జాడ తెలియకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. వారు కూడా నగరాన్ని జల్లెడపట్టినా ఆచూకీ దొరకలేదు. ఇలా ఒక రాత్రి గడిచిపోయింది. ఉదయాన్నే పోలీసులు బాధితుల ఇంటికి వెళ్లి 'ఇక ఆమె రాదు.. నగల కోసం మీకు తెలిసినవారే ఆమెను హత్య చేశార'ని చెప్పడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి అతడు పన్నాగం వేశాడు. తన కుటుంబానికి బాగా తెలిసిన వృద్ధు రాలిని హతమార్చి బంగారు ఆభరణా లను దోచేయాలని పక్కా ప్లాన్ వేసి అమ లు చేశాడు. అయితే, సూట్ కేసులో కుక్కిన మృతదేహాన్ని పడవేసే క్రమంలో కుమార్తెతో సహా పోలీసులకు అడ్డంగా దొరికి పోయారు. తమిళ, తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే..

తండ్రీకూతుళ్లను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు





మృతురాలు రమణి (ఫైల్)

- నెల్లూరులో వృద్ధురాలి దారుణ హత్య
- సినీ ఫక్కీలో మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నం
- సూట్‌కేస్‌లో శవాన్ని కుక్కిన తండ్రి, కూతురు
- చెన్నై పరిసరాల్లో పడేసేందుకు విఫలయత్నం
- చివరకు తమిళ రైల్వేపోలీసులకు దొరికిపోయిన వైనం

నెల్లూరు (క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజేంద్రనగర్‌లో మణ్యం మురుగేశం, రమణి దంపతులు ఉంటున్నారు. వీరికి నలుగురు సం తానం. సోమవారం ఉదయం కూరగాయల కోసం రమణి (65) సమీపంలోని దుకాణానికి వెళ్లింది. ఎంత సేపటికి ఆమె రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించి సాయంత్రం సంతపేట పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసుగా నమోదు చేసి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్‌ఐ బాలకృష్ణలు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఇన్‌స్పెక్టర్‌కు తమిళనాడులోని చెన్నై సమీపంలో ఉన్న మీంజూరు రైల్వే పోలీసులు ఫోన్ చేసి సూట్‌కేసులో వృద్ధురాలి మృతదేహం గుర్తించామని, సూట్‌కేసు తెచ్చిన నెల్లూరుకు చెందిన బాలసుబ్రహ్మణ్యం, ఈయన కుమార్తె దివ్యశ్రీ తమ అదుపులో ఉన్నారని చెప్పారు. మృతదేహం ఫొటోను పరిశీలించిన ఇన్‌స్పెక్టర్ రమణి అని రైల్వే పోలీసులకు తెలిపారు. దీంతో మింజూరు రైల్వే పోలీసులు తండ్రి, కుమార్తెలను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, హత్య చేసిన తీరును వెల్లడించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

• పొరుగు రాష్ట్రంలో పడేయాలనీ..

బాలసుబ్రహ్మణ్యం కుటుంబం గతంలో రమణి ఇంటికి సమీపంలోనే ఉండేది. దీంతో వారి మధ్య పరిచయం ఉంది. కొంతకాలం క్రితం అదే ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లోకి బాలసుబ్రహ్మణ్యం కుటుంబం వెళ్లింది. అయితే, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాలసుబ్రహ్మణ్యం తనకు తెలిసిన రమణి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో రెండు, మూడు రోజులుగా వృద్ధురాలి కదలికలపై నిఘా ఉంచారు. సోమవారం కూరగాయలకు వెళ్లిన వృద్ధురాలితో మాటామాటా కలిపి తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న సరుడు, నల్లపూసల దండ, కమ్మలు దోచుకున్నాడు. అయితే, మృతదేహాన్ని నెల్లూరు జిల్లాలో ఎక్కడైనా పడేస్తే దొరికిపోతామని భావించిన నిందితుడు తమిళనాడులోని చెన్నై సమీపంలో పడేయాలని నిర్ణయించుకున్నాడు. ఓ ట్రావెల్ సూట్‌కేస్‌లో రమణి మృతదేహాన్ని కుక్కారు. సోమవారం సాయంత్రం సూట్‌కేస్ తీసుకొని బాలసుబ్రహ్మణ్యం, దివ్యశ్రీలు ఊరెళ్తున్నామంటూ చుట్టుపక్కల వారిని నమ్మించారు. నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో సూట్‌కేస్‌తోపాటు చెన్నై వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలులో రద్దీ ఎక్కువగా ఉండటంతో సూట్‌కేస్‌ను బయట పడవేసేందుకు అవకాశం దొరకలేదు. చెన్నై సమీపిస్తుండటంతో మీంజూరు స్టేషన్‌లో సూట్‌కేస్ తీసుకొని రైలు దిగేశారు. నెల్లూరు వైపు వెళ్లే రైలు ఎక్కి మార్గమధ్యంలో సూట్‌కేస్‌ను పడేయాలని అనుకుని అక్కడే ఉన్నారు. అదే సమయంలో ప్లాట్‌ఫాంపై రైల్వే పోలీసులు విజిల్ వేయడంతో తండ్రీకూతుళ్లు కంగారు పడి అక్కడ నుంచి వెళ్లబోయారు. ఇంతలో ఓ యువకుడు సూట్‌కేస్‌ను మరిచిపోయి వెళుతున్నారంటూ పెద్దగా కేకలు వేశారు. రైల్వే పోలీసులు వారిని ఆపి సూట్‌కేస్ మీదేనా అని ప్రశ్నించడంతో భయంతో వారు సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. సూట్‌కేస్‌ను పరిశీలించగా అందులో నుంచి రక్తం వస్తుండటంతో వృద్ధురాలి మృతదేహం బయటపడింది. దీంతో రైల్వే పోలీసులు తమదైన శైలిలో విచారించగా బంగారు ఆభరణాల కోసమే హత్య చేసినట్లు బాలసుబ్రహ్మణ్యం వెల్లడించినట్లు తెలిసింది.

మృతదేహం అప్పగింత

హత్య విషయంపై సమాచారం అందుకున్న సంతపేట ఎస్ఐ బాలకృష్ణ, బాధిత కుటుంబసభ్యులతో కలిసి మీంజూరు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసు అధికారులతో మాట్లాడి స్థానిక వైద్యశాలలో రమణి మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. హత్య జరిగిన ప్రాంతం నెల్లూరు కావడంతో త్వరలోనే కేసును బదిలీ చేస్తామని అక్కడి పోలీసులు తెలిపారు. హత్య జరిగిన సమయంలో బాలసుబ్రహ్మణ్యం భార్య, కుమార్తె ఇంట్లోనే ఉన్నారు. దీంతో ప్రమేయం ఏమైనా ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నెల్లూరు: ధర్మరాజుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగేంద్రాయ నమః

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. దేవాలయాలు, చెరువు గట్లు, పొలాలగట్ల వెంబడి ఉన్న పుట్టలకు పాలు పోసి, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చవితి నోము లు నోచారు. కన్యలు వివాహం కోసం, నవ దంప తులు సంతానం కోసం, మహిళలు సౌభా గ్యం కోసం, నాగేంద్రస్వామిని పూజించారు. నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షను ఆచరించారు. కొందరు చంద్రోదయం అనంతరం దీక్ష విరమిం చగా మిగిలిన వారు బుధవారం ఉదయం పునః పూజానంతరం ఉపవాస దీక్ష విరమించను న్నారు. నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయం, పొర్లు కట్ట, శెట్టిగుంట రోడ్డు, నాగేంద్రనగర్, నిప్పో సెంటర్, డైకస్ రోడ్డులోని పుట్టల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే బారులుతీరి నోముదారులు చుట్టి పాలుపోసి పూజలు చేశారు.



నెల్లూరు : నాగుల విగ్రహాన్ని పాలతో అభిషేకిస్తున్న ముస్లిం కుటుంబం

ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్

నెల్లూరు(క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు జిల్లా జైలులో ఉన్నాడు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుళ్లు విజయకుమార్, మోహన్‌రావు సదరు నిందితుడిని విచారణ నిమిత్తం కోర్టుకు తీసుకెళ్లారు. తిరిగి జైలుకు తరలించే క్రమంలో నిందితుడిని ఆయన ఇంటికి తీసుకెళ్లారు. భార్యవల్లే తాను జైలుకెళ్లానని అప్పటికే ఆగ్రహంతో ఉన్న నిందితుడు భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. విచారణకు ఆదేశించిన ఎస్పీ ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరులో రూ.10కే ఆర్టీసీ ప్రయాణం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం లోని ఆర్టీసీ బస్టాండు నుంచి అయ్యప్పగుడి వరకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ల్లో ఎక్కడ ఎక్కి ఎక్కడ దిగినా కేవలం రూ.10 మాత్రమే చార్జీ వసూలు చేస్తున్నామని 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఆటోలో ప్రయాణి కుల నుంచి రూ.20 కనీస చార్జి వసూలు చేస్తున్నారని, ఆర్టీసీ బస్సులో అయితే సగం ధరకే ప్రయాణం చేయవచ్చని, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

ప్రభుత్వ భూమేగా.. ఆక్రమించేయ్!

- దాచూరులో అక్రమార్కుల బరితెగింపు
- 200 ఎకరాల ప్రభుత్వ భూమిపై కొందరి కళ్లు
- ఇప్పటికే 70 ఎకరాల్లో నిమ్మ, మినుము పైర్ల సాగు
- కొన్నేళ్లుగా ఈ పొలాలను కొట్టేసేందుకు ప్రయత్నాలు

నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం దాచూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.989లో 500 ఎకరాలకుపైగా మేత పోరంబోకు భూములు ఉన్నాయి. వీటిలో 300 ఎకరాలకుపైగా కండలేరు జలాశయం కింద ముంపునకు చేరింది. మరో 200 ఎకరాల భూమి ఖాళీగా ఉంది. కండలేరు జలాశయం కింద దాచూరు, కొలవ నాయుడుపల్లి వంటి గ్రామాల్లోని కొందరు పేదలు సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు కోల్పోయారు. అటువంటి వారికి ఈ 200 ఎకరాలను పంపిణీ చేయాలని 2009లో నిర్ణయించారు. అందుకు అనుగుణంగా భూమి స్వభావాన్ని మేత పోరంబోకు నుంచి అనాధీనంగా మర్చారు. అయితే పేదల మాటున కొందరు పెద్దలు కూడా ఈ భూమిని సొంతం చేసుకునేందుకు అప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు కొందరు అర్హులైన పేదలను గుర్తించి వారికి ఒక్కొక్కరికి ఎకరం చొప్పున భూమి ఇచ్చేందుకు నిర్ణయించారు. కానీ ఈ భూమిపై కన్నేసిన పెద్దలు హైకోర్టును ఆశ్రయించారు. తమకు కూడా భూమి ఇవ్వాలంటూ పిటిషన్ వేయగా, ఆ పిటిషన్‌ను పరిశీలించాలని హైకోర్టు జిల్లా అధికారులకు సూచించింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన అప్పటి జిల్లా అధికారులు.. పిటిషన్ దారులంతా అనర్హులని తేల్చారు. ఆ తర్వాత అర్హులైన పేదలకు కొంత భూమిని పంపిణీ చేసినా ఆ భూమిలోకి వారిని వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించారు. ఇప్పటికీ ఈ పట్టాలు అందుకున్న కొందరు లబ్ధిదారులు తమకు భూమి అప్పగించండి అంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు.

● కొంచెం కొంచెంగా ఆక్రమిస్తూ..

ఇదిలా ఉండగానే గడిచిన రెండు నెలలుగా కొందరు ఆక్రమణల పర్వం మొదలుపెట్టారు. కొంచెం కొంచెం ఆక్రమించుకుంటూ 70 ఎకరాల దాకా తమ గుప్పెట్లో పెట్టేసుకున్నారు. కండలేరు జలాశయాన్ని ఆనుకొని ఉన్న భూములు కావడం, ఎర్రమట్టి నేల కావడంతో నిమ్మ, మినుము వంటి పంటలను వేసేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా మొదట్లో స్పందించలేదు. అయితే ఆక్రమణలు ఎక్కువవుతుండటంతో సీరియస్‌గా తీసుకున్న రెవెన్యూ సిబ్బంది.. సోమవారం ఆక్రమించిన భూముల్లో బోర్డులు పెట్టారు. ఇవి ప్రభుత్వ భూములని, ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. అయినా ఆక్రమణదారులు వెనక్కు తగ్గడం లేదని తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల తర్వాత మళ్లీ మిగిలిన భూమిని చదును చేసుకు నేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుతోంది. నిమ్మ, పెసర, మినుము సాగు చేస్తున్న భూముల్లో రెవెన్యూ సిబ్బంది బోర్డులు పాతారు తప్ప ఆ పంటలను దున్నేయలేదు. దీంతో కొన్నాళ్ల తర్వాత ఆ పంటలు పెరిగితే మళ్లీ ఆక్రమణదారులకు అవకాశమిచ్చినట్లు అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రూ.కోట్లు విలువైన ఈ 200 ఎకరాల భూమిపై మొదటి నుంచీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది. కండలేరులో భూములు కోల్పోయిన వారితోపాటు స్థానికంగా అనేక మంది పేదలు ఉన్నారు. వీరికి ఆ భూములను నిబంధనల మేరకు పంపిణీ చేస్తే పేదలకు చేయూతను అందించవచ్చు. కానీ ఎవరూ కూడా ఈ ఆలోచన చేయకుండా ఆక్రమణలకు పరోక్షంగా సహకరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



దాచూరులోని ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు

దాచూరు రెవెన్యూ పరిధిలో ఆక్రమణలకు గురవుతున్న భూముల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. ఎవరైనా పేదలు ఉంటే నిబంధనల ప్రకారం అసైన్‌మెంట్ కమిటీల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఆక్రమణల విషయం మా దృష్టికి రాగానే హెచ్చరిక బోర్డులు పెట్టాం. ప్రభుత్వ భూముల్లో నాటిన మినుము, నిమ్మ చెట్లు వంటి వాటిని తొలగిస్తాం.

- శ్యామ్‌సుందరరాజు, కలువాయి తహసీల్దార్

సమాజ సేవే.. వారి అభిమతం

ఊరి బాగు కోసం ఆ యువకులంతా ఏకమయ్యారు. గ్రామస్థుల్లో విద్య, సామాజిక చైతన్యం తీసుకొచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనుకున్నారు. అందుకు దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేశారు. అనుకున్నదే తడువుగా 2015లో స్నేహితులంతా 'యువనేస్తం సేవా ఫౌండేషన్' ఏర్పరుచుకుని, చంద్రకాంత్ సారథ్యం వహించారు. ఆనాటి నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామస్థుల నోట 'శభాష్' అనిపించుకుంటున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

- అబ్దుల్ కలాం స్ఫూర్తిగా ముందడుగు
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలు
- అందరికీ ఆదర్శం సిద్ధిపురం యువత

విద్యార్థులకు విద్యా సామగ్రి అందచేస్తున్న యువనేస్తం సభ్యులు



సంగం మండలం సిద్ధీపురంలో వినాయక ఉత్సవాలకు ఏర్పడిన ఓ సంఘం చంద్రకాంత్ ఆధ్వర్యంలో ప్రసన్నకుమార్, వినోద్, శ్రీనివాస్, నాయబ్ రసూల్ అనే యువకులంతా ఒకటై యువనేస్తం సేవా ఫౌండేషన్‌గా రూపుదిద్దుకుంది.



యువనేస్తం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా యేటా అక్టోబరు 15న రక్తదాన శిబిరం ఏర్పాటు.
- గ్రామంలో ఉన్న పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ.
- నెల్లూరుకు చెందిన లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత వైద్య, కంటి శిబిరాల నిర్వహణ
- దాతల సహకారంతో అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు, కుట్టుమిషన్ అందజేత
- గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా వినాయక ఉత్సవాల నిర్వహణ

అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రజల్లో విద్య సామాజిక చైతన్యం వంటి సేవా కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని ఆ ఫౌండేషన్ సభ్యులంతా భావించారు. మొదట్లో తమ వద్ద ఉన్న డబ్బులతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల పరిశుభ్రతపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం, బడి ఈడు పిల్లలను బడికి పంపే విధంగా కృషి చేశారు. అలాగే ప్లాస్టిక్ కవర్లు వాడకం వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ యువకులు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి గ్రామస్థులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకారం అందించారు.

సేవా అకౌంట్ ఉండాలి



ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతాలా సేవా అకౌంట్ ఉండాలి. బ్యాంకు నగదు లావాదేవీలు మాదిరిగా తరుచూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. అందరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైతే సమాజం అభివృద్ధి చెందుతుంది.

- పీ చంద్రకాంత్, యువనేస్తం సభ్యుడు

తీరనున్న ఆకాంక్ష!

(3వ పేజీ తరువాయి)

తమ కలలు నిజం కాబోతున్నాయన్న ఆనందంతో టెట్, డీఎస్సీలకు సన్నద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లలో 615 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 37, లాంగ్వేజ్-2 17, ఆంగ్లము 83, లెక్కలు 62, ఫిజికల్ సైన్స్ 75, బయాలజీ 62, సోషల్ 102, ఫిజికల్ ఎడ్యుకేషన్ 105, ఎస్‌జీటీ 72 కలిపి మొత్తం 615 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. వీటితోపాటు మునిసిపల్ విభాగంలో మరో 60 పోస్టులకుపైగా భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

డీఎస్సీ శిక్షణకు స్ర్కీనింగ్ టెస్ట్

నెల్లూరు (హరనాథపురం) : సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న డీఎస్సీ శిక్షణకు స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9581630003 నెంబరుకు ఫోన్ చేయాలని, పరీక్ష హాలుకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని కోరారు.

మోసగాళ్లుగా చూస్తున్నారు

(3వ పేజీ తరువాయి)

సమావేశాలు నిర్వహించా లని, ఆ మేరకు సభలో తీర్మానం చేయాలని కోరగా, మిగిలిన సభ్యులు మద్దతు తెలిపారు.

● నన్నూ గుర్తించండి : ఎమ్మెల్సీ

రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు తననూ గుర్తించి మర్యాద ఇవ్వాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మేయర్‌ను కోరారు. తాను సభలో ఉన్నప్పటికీ మాట మాత్రం కూడా పేరు ప్రస్తావించలేదని ఆక్షేపించారు. సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువలపై పచ్చదనం, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు కొనసాగించాలని కోరారు. కొన్ని దుకాణాలకు పసుపు రంగు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిపై విచారణ జరపాలంటూ మేయర్, కమిషనర్ వినతి పత్రం అందచేశారు.

● 64 అంశాలకు ఆమోదం

కాగా, సభ మధ్యాహ్నం తిరిగి సమావేశమయ్యాక పాలక మండలి 73 అంశాలతో ప్రవేశ పెట్టిన అజెండాలోని 64 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 4 అంశాలను పునఃసమీక్షించాలని నిర్ణయించారు. మరో ఐదింటిని తిరస్కరిస్తున్నట్లు మేయర్ వెల్లడించారు. టేబుల్ అజెండాపై చర్చించేందుకు సభ్యులు ఆమోదం తెలుపకపోవడంతో వాటిని పక్కనపెట్టేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి సమావేశానికి టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు వారి పార్టీ కండువాలతో హాజరవడం విశేషం. ఈ సభలో కమిషనర్ సూర్యతేజ, డీసీ చెన్నుడు, ఏడీసీ నందన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో మెరుగైన సేవలు

- పడుగుపాడులో అతి పెద్ద ధాన్యం నిల్వ కేంద్రం
- నూతన సంఘాల ఏర్పాటుకు కమిటీ
- కలెక్టర్ ఆనంద్



పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సహకార సంఘాలను పటిష్టపరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకుల తరహాలో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాల ఆధునీకరణ, డిజిటలైజేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూ టరీకరణ చివరి దశకు వచ్చిందన్నారు. దీనివల్ల సభ్యులకు సత్వర సేవలు అందుతాయన్నారు. జిల్లాలోని ఎన్‌డీసీసీబీ, ప్రకాశం జిల్లా డీసీసీ బ్యాంకుకు అనుసంధానించబడిన 61 పీఏసీఎస్‌లలో క్రియాశీలక సభ్యుల రుణాలు, డిపాజిట్లు, భూమి వివరాలు 87.99 శాతం కంప్యూటరీకరణ పూర్తయింద న్నారు. ప్రపంచ వికేంద్రీకృత ఆహార భద్రతా పథకం కింద పడుగుపాడు పీఏసీఎస్‌కు అతి పెద్ద ధాన్యం నిల్వ కేంద్రం మంజూరైనట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా బహుళ ప్రయోజన సేవలు రైతులకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్తగా బహుళ ప్రయోజన పీఏసీఎస్‌లు, మత్స్యకారుల సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు స్థాపించడానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. దీనికి సంబంధించిన జిల్లా కమిటీ సమావేశం కూడా శంకరన్ హాల్లో జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశ్రమల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియపరచాలన్నారు. అధికారులు కూడా తరచూ తనిఖీలు చేపట్టి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ముత్తుకూరు పరిసర ప్రాంతంలో ఫైర్ స్టేషన్, ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, కార్మికశాఖ అధికారి వెంకటేశ్వర్లు, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ సుష్మ, కాలుష్య నియంత్రణ అధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హాకీ చాంపియన్ కడప

- ముగిసిన బాలబాలికల రాష్ట్ర హాకీ పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హాకీ పోటీల్లో రెండు విభాగాల్లో కడప జిల్లా జట్లు చాంపియన్‌గా నిలిచాయి. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కడప ప్రథమస్థానం, చిత్తూరు ద్వితీయ, పశ్చిమగోదావరి జట్టు తృతీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో కడప ప్రథమం, అనంతపురం ద్వితీయ, విశాఖపట్నం తృతీయ స్థానం దక్కించుకున్నాయి. విజేతలకు నెల్లూరు ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి ట్రోఫీలను అందచేశారు. కార్యక్రమంలో సౌత్‌మోపూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మి, ఆర్‌ఐపీ మహబూబ్ బాషా, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే అన్వర్‌బాషా, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎన్ విజయ, విద్యా కమిటీ చైర్మన్ టీ పెంచలయ్య, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకులు థామస్‌పీటర్, సురేష్‌బాబు, పీఈటీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఒలంపిక్ సంఘం కార్యదర్శి గురుప్రసాద్, పరిశీలకులు రవిరాజు, సెల్వపాండ్యన్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా ఉండాలి

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ
- అధికారులకు శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, మండలాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు అభివృద్ధి ప్రణాళికలను పగడ్బందీగా రూపొం దించాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మెరుగైన సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. దీనిపై శిక్షణ తరగతుల్లో అవగాహన పెంపొందిం చుకొని పగడ్బందీగా ప్రణాళికలను తయారు చేసి నిర్దిష్ట సమయంలోపు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీలు, మండ ల పరిషత్‌ల పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులంతా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెదపవనిలో భారీ చోరీ

- ఎవరూ లేని ఇంట్లో 37 సవర్ల బంగారం, రెండున్నర కిలోల వెండి చోరీ
- వీటి విలువ రూ.6లక్షలు
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- ఇంటిని పరిశీలించిన డీఎస్పీ, క్లూస్‌టీం అధికారులు

లింగసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెదపవని గ్రామంలోని ప్రతిభ బాల హైస్కూల్ సమీపంలోని తూర్పువైపు ఉన్న కాలనీలోని టీడీపీ గ్రామ నాయకుడు రామిశెట్టి మాలకొండయ్య ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల విలువ చేసే బంగారం, వెండి నగలు తీసుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీన మాలకొండయ్య కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి ఎవరూలేని ఇంట్లో చొరబడ్డారు. ఇంటికి ఉన్న ప్రధాన ద్వారం తలుపుల తాళం పగులగొట్టి ఇంటిలోపలికి చొరబడ్డారు. పరుపు మంచం కింద ఉన్న లాకర్‌ను పగులగొట్టి అందులోని 37 సవర్ల బంగారం, రెండున్న కిలోల వెండి నగలు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం 6గంటల సమయంలో మాలకొండయ్య ఇంటి ఎదురుగా ఉన్న బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి మాలకొండయ్య ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి వెంటనే మాలకొండయ్యకు ఫోన్ ద్వారా విషయం తెలిపారు. ఆయన ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి, ఇంటి లోపల లాకర్ పగులగొట్టి ఉండడం, దుస్తులు చిందరవందరగా ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● క్లూస్‌టీం పరిశీలన

విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభాని వెంటనే విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేసి సిబ్బందితో పెదపవని వెళ్లి ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, నెల్లూరు క్లూస్‌టీం అధికారులు బాధితుడితో మాట్లాడారు. ఇంటి పరిసరాలను, ఇంటి లోపల దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం అధికారులు వేలిముద్రల కోసం పౌడర్ చల్లి ఆధారాలకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా బాధితుడు మాలకొండయ్య మాట్లాడారు. బంగారు వస్తువులు 6గాజులు, 2 నెక్లెసులు, పూలహారం, పచ్చల హారం, చైన్లు, నల్లపూసల దండతో పాటు వెండి పళ్లాలు, హారతి ప్లేటు పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాల సుబ్రమణ్యం తెలిపారు.

బాధితుడిని వివరాలు అడుగుతున్న డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం





ఇంటిలోని పరుపు, మంచం కింద ఉన్న లాకర్‌ను పగులగొట్టిన దుండగులు

గుర్తు తెలియని మహిళ మృతి



చేజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని శివాలయం సమీపంలో గుర్తు తెలియని మహిళ (30 నుంచి 40 ఏళ్ల లోపు) మృతి చెంది ఉండడాన్ని మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ సైదులు, ఏఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. మృతురాలు స్థానికరాలు కాకపోవడంతో మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి బంధువులు వచ్చేవరకు మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచుతామని , వారు వచ్చాక పోస్టుమార్టం పూర్తిచేస్తామని పోలీసులు తెలిపారు.



అబ్బురపరిచిన మాక్ డ్రిల్

మత్స్యకారులు సునామీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పోలీస్, ఫైర్, హెల్త్ శాఖల సిబ్బందితోపాటుగా కృష్ణపట్నం పోర్టు మెరైన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణపట్నంలో మంగళవారం నిర్వహించిన సునామీ రెస్క్యూ మాక్ డ్రిల్ అబ్బురపరిచింది. నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష పర్యవేక్షణలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సునామీ, తుపాను సమయాల్లో మత్స్యకారులకు ఎదురయ్యే ఇబ్బందులు, ప్రమాదం భారినపడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బాలకృష్ణారెడ్డి, మెరైన్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి, ఎస్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ శెట్టి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి వీరశేఖర్, వైద్యులు దేవీకృప, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు. - ముత్తుకూరు,(ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్‌నకు 13 నుంచి ఇంటర్వ్యూలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు కాకుటూరులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ వీ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి 13వ తేదీ, నెల్లూరుకు 14వ తేదీ, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు 15వ తేదీ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆయా తేదీల్లో హాజరు కావాలని కోరారు.

ఉదయగిరి జిల్లా సాధన కోసం రేపు ర్యాలీ

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఇంకా వైసీపీ వాసనలే..!


నెల్లూరు (వైద్యం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు మాసాలు పూర్తయినా ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు మాత్రం గత ప్రభుత్వంలో ఉన్నట్లు వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగానే కొనసాగుతున్నాయి. నెల్లూరు నగరంలో 20 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటన్నింటికీ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలనే బోర్డులే కనిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కనున్న ఆరోగ్య కేంద్రానిదీ ఇదే పరిస్థితి!. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రాలుగా పేరు మార్చగా నెల్లూరులో మాత్రం వైసీపీ వాసనలు ఇంకా పోలేదు. దీనికి కారణంగా వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు ముఖ్య అధికారులు వైసీపీ సానుభూతిపరులు కావడమే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరు మార్పు విషయం వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న వాదన వినిపిస్తోంది.



ట్యాంకర్‌ను ఢీకొన్న మోటారు సైకిల్

స్టాఫ్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

మనుబోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చతుకుమాటి దిలీప్‌కుమార్‌రెడ్డి (41) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... కోట మండలం పుచ్చలపల్లికి చెందిన దిలీప్ కుమార్‌రెడ్డి నెల్లూరులోని కావేరి ఎస్టేట్స్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం మోటార్‌సైకిల్‌పై స్వగ్రామం పుచ్చలపల్లికి వెళ్లేందుకు బయలుదేరాడు. మండల పరిధిలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాటర్ ట్యాంకర్ హఠాత్తుగా మలుపు తిప్పడంతో వెనుకనే ఉన్న మోటారుసైకిల్ వేగాన్ని అదుపుచేయలేక ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. దీంతో దిలీప్‌కుమార్‌రెడ్డి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వాటర్ ట్యాంకర్ డివైడర్‌పై ఉన్న చెట్లకు నీరు పడుతోంది. సిబ్బంది రెండు మార్గాల్లో వాహనాలు రాని సమయం చూసి మలుపు తిప్పాల్సి ఉండగా, సడన్‌గా మలుపుతిప్పగా నెల్లూరు వెళ్లే మార్గంలో వాహనాలు రావడంతో ట్యాంకర్‌ను గూడూరు మార్గంలోనే నిలపడంతో ఈ ప్రమాదం జరిగింది.



ప్రమాదస్థలిలో మృతి చెందిన దిలీప్‌కుమార్ రెడ్డి



దిలీప్‌కుమార్ రెడ్డి (ఫైల్)

● హెల్మెట్ ఉన్నా దక్కని ప్రాణం

మృతుడు హెల్మెట్ ధరించి ఉండానన్న ధైర్యంతో వేగంగా వస్తున్నాడు. అయితే హెల్మెట్ లాక్ వేసుకోలేదు. ప్రమాదం జరగగానే హెల్మెట్ ఎగిరి పడిపోయింది. దీంతో మృతుడు తల రోడ్డుకు తగలడంతో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను స్టేషన్‌కు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనుపూరు కాలువ వద్ద ఉద్రిక్తత

● టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట



రోప్ సాయంతో టీడీపీ శ్రేణులను అడ్డుకుని వైసీపీ శ్రేణులను అక్కడి నుంచి పంపుతున్న పోలీసులు

పొదలకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం ఆనకట్ట సమీపంలోని కనుపూరు కాలువ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా టీడీపీ నాయకులు, రైతుల భాగస్వామ్యంతో నారుమడులకు సాగు నీరు అందించాలని ఆనకట్ట వద్ద యంత్రాలతో కనుపూరు కాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి టెండర్లు పిలవకుండానే కాలువ పూడికతీత పనులు ఎలా చేస్తారంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. అలాగే మంగళవారం కాలువను పరిశీలించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు భారీ సంఖ్యలో కనుపూరు కాలువ వద్దకు చేరుకున్నారు. వారి వాగ్వాదంతో ఉద్రిక్తత, తోపులాట జరిగింది. దీంతో పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ హనీఫ్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రోప్ సాయంతో ఇరువర్గాలను కలవకుండా చేశారు. వైసీపీ శ్రేణులను అక్కడి నుంచి గ్రామంలోకి పంపించారు. దీంతో పరిస్థితి సర్దుమణిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కాకాణి పదవలతో కేవలం గుర్రపు డెక్కను మాత్రమే తొలగించి పూడికతీయకుండానే రూ.కోట్లు కాజేశారని, ఈ విషయాన్ని అప్పట్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొన్ని ఆధారాలను బయటపెట్టారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో రైతులతో కలిసి తాము కనుపూరు కాలువ పూడికతీత పనులు మొదలుపెడితే కాకాణి తమ నాయకులను, గ్రామస్థులను ఉసిగొల్పి రైతులకు సాగునీరు రాకుండా అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. గత వైసీపీ హయాంలో ఎప్పుడు టెండర్లు పిలవలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐలు రవినాయక్, వేమారెడ్డితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, పార్లపల్లి సురేష్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, గంటా మల్లికార్జున్‌యాదవ్, కృష్ణయాదవ్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● పోలీసులు లేకుండా వస్తే మేమేమిటో చూపిస్తాం : వైసీపీ

పోలీసులను లేకుండా వస్తే తామేమిటో చూపిస్తామని టీడీపీ శ్రేణులను వైసీపీ నాయకులు హెచ్చరించారు. విరువూరులో మాజీ సర్పంచు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి వైసీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కనుపూరు కాలువ పూడికతీత పనులను పరిశీలనకు వచ్చే క్రమంలో తాము అక్కడ వెళ్లామన్నారు. టీడీపీ వర్గీయులు అనవసరంగా తమ ఫ్లెక్సీలను చించి వేసి, తమకు వ్యతిరేకంగా ప్రవర్తించారన్నారు. పోలీసులను పక్కనపెట్టి వస్తే తామేదో చూపించేవారమని, గ్రామాల్లో కొత్త సంస్కృతిని టీడీపీ తీసుకొస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పెద్దమల్లు రమణారెడ్డి, తెనాలి నిర్మలమ్మ, వాకాటి శ్రీనివాసులురెడ్డి, దశకంఠాద్రి శర్మ, తదితరులు ఆల్గొన్నారు.

● కాకాణి హౌస్ అరెస్టు

పొదలకూరు మండలం సంగం ఆనకట్ట సమీపంలోని కనుపూరు కాలువ పూడికతీత పనులను పరిశీలించేందుకు రైతులతో కలిసి మంగళవారం బయలేదేరిన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. గృహ నిర్బంధంలో ఉన్న కాకాణి మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నప్పుడు సోమిరెడ్డిని అడ్డుకుని ఉంటే, అల్లీపురం నుంచి కూడా బయటకు రాలేకపోయేవారని విమర్శించారు. ఈనెల 11వ తేదీ వరకు టెండర్లకు గడువు ఉన్నా నామమాత్రంగా ముందుగానే పనులు ప్రారంభించి రూ.కోట్లు కొల్లగొట్టడానికి వేసిన స్కెచ్ బహిర్గతం అవుతుందని భయపడి పోలీసులను పురమాయించారన్నారు. సోమిరెడ్డి అవినీతిపై పోరాటం కొనసాగుతుంది తప్ప వదిలి పెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7601
వెండి కిలో ధర	రూ. 97,500
వెండి ఒక గ్రాము	రూ.100.50

ఉచిత గ్యాస్‌కు

ఈకేవైసీ చిక్కు

అది ఉంటేనే 'దీపం-2' సిలిండర్లు

అవగాహన లేమితో ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులు

ఇప్పుడైనా చేయించుకోవచ్చంటున్న అధికారులు

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని పొందడానికి వినియోగదారులకు కొత్త చిక్కు వచ్చిపడింది. సమస్యలేమీ లేకుండా తమకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందుతాయని భావిస్తున్న కొందరికి ఈకేవైసీ రూపంలో నిరాశే మిగులుతోంది. దీనిపై అవగాహన లేని వారు ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 'దీపం-2' పేరుతో విడుదల చేసిన ఉచిత సిలిండర్ పొందేందుకు అర్హత పొందలేకున్నారు.



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని పొందటానికి లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. వంట గ్యాస్ కనెక్షన్ తీసుకునే సమయంలో కనెక్షన్‌కు ఆధార్ లింకు చేయాలి. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాతో గ్యాస్ కనెక్షన్‌నూ అనుసంధానించాలి. ఈ మొత్తం ప్రక్రియను ఈకేవైసీ అంటారు. ఇలా ఒకసారి చేస్తే సరిపోదు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకేవైసీని అప్‌డేట్ చేసుకోవాలని చమురు సంస్థల అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అవగాహనలేక చాలా మంది ఈకేవైసీని నిర్లక్ష్యం చేశారు. ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పుడు ఈకేవైసీ చేయించుకుని ఆ తరువాత మర్చిపోయారు. అయితే ఈకేవైసీ ఉంటేనే గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ లభిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ సిలిండర్ ధర రూ.840గా ఉంది. దీనికి సబ్సిడీ రూ.18.74ను వినియోగదారుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. కాగా, సబ్సిడీ మొత్తం తక్కువగా ఉండటంతో చాలా మంది ఈకేవైసీ విషయాన్ని పట్టించుకోలేదు. అసలు సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాల్లో పడుతోందో లేదో కూడా కొందరు చూసుకోవటం లేదు. ఇప్పుడు ఇదే అంశం ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారులకు సంకటంగా మారింది. ఆ సిలిండర్ పొందేందుకు లబ్ధిదారుకు తప్పనిసరిగా రేషన్ కార్డు ఉండాలి. అదే విధంగా ఈకేవైసీ చేయించుకుని ఉండాలి. ఈ రెండింటిలో ఏది లేకపోయినా ఉచిత సిలిండర్‌ను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

7.33 లక్షల కనెక్షన్‌లు :

జిల్లాలో 7,33,520 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్‌కు 4,06,522 కనెక్షన్లు అర్హత కలిగినట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ ఈకేవైసీ ఉండటం, ఇతర నిబంధనలు పాటించడం వల్ల ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగలరని తెలిపారు. మిగిలిన వారిలో కొందరికి అర్హత ఉన్నప్పటికీ రేషన్‌కార్డు, ఈకేవైసీ వంటి కారణాలతో సిలిండర్ పొందలేక పోతున్నారు. కాగా, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందచేయడానికి ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం లో ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. గడిచిన ఐదేళ్లలో పెళ్లి చేసుకుని కొత్త జీవితం ప్రారంభించిన జంటలకు కొత్త రేషన్‌కార్డులు ఇప్పటికీ రాలేదు. కుటుంబాలు వేరైన తరువాత పాత రేషన్ కార్డుల విభజనకు దరఖాస్తు చేసుకున్నా వారికి కూడా కార్డులు రాలేదు. కానీ, అధికారులు మాత్రం తమ దగ్గర రేషన్ కార్డుల కోసం పెండింగ్ దరఖాస్తులు లేవని చెపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించి ఉచిత గ్యాస్‌కు అర్హులైన వారికి ప్రయోజనం చేకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈకేవైసీ చేయించుకోవాలి

గ్యాస్ కనెక్షన్ కలిగిన వారు ఈకేవైసీ చేయించుకోవాలి. మొదటి ఉచిత సిలిండర్‌ను వచ్చే ఏడాది మార్చి ఆఖరులోగా పొందే అవకాశం ఉన్నందున తొందర పడకుండా ఈకేవైసీ చేయించుకోవాలి. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత గ్యాస్ అందుతుంది. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్ దగ్గర కూడా ఈకే వైసీ చేయించుకునే వెసులుబాటు ఉంది. సచివాలయానికి వెళ్ల యినా ఈకేవైసీ చేయించుకోవచ్చు. అందుకు ఏర్పాట్లు చేశాం.



- డీవీ రమణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సోమశిలలో 70.236 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 10,929 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 70.236 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,100, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తరకాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'కౌశల్'తో ప్రతిభాన్వేషణ

జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు కౌశల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ బాలాజీరావు తెలిపారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్-2024 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పిల్లల్లో పోటీతత్వం పెంపొందించేందుకు ఇవి ఎంతో దోహదం చేస్తాయని, గత ఆరేళ్లుగా జిల్లాలో వీటిని నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 15వతేదీ లోపు www.bvmap.org వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది విద్యార్థులు, పోస్టర్, రీల్స్ పోటీలకు తరగతికి ఇద్దరు చొప్పును ఆరుగురు విద్యార్థులు కలిపి ఒక్కో స్కూల్ నుంచి మొత్తం 15 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 20 నుంచి 22వతేదీ వరకు, జిల్లా స్థాయిలో డిసెంబరు 6వతేదీ, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 30వతేదీన ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షలుంటాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తిరుపాలు, కౌశల్ కార్యక్రమ సమన్వయకర్త ఆర్ఆర్ఎస్ ప్రసాద్, సంయుక్త సమన్వయకర్త యూఎస్ రఘుకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పూడి ప్రసాద్, భారతీయ విజ్ఞాన మండలి ప్రతినిధులు, కౌశల్ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో



సంగం : వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో ప్రబలుతున్న అంటు వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం పెంచలయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరు అర్బన్ వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదల, నియోనియా తదితర హైరిస్క్ వ్యాధులు, కుటుంబ నియంత్రణపై వైద్య సిబ్బందికి వివరించారు. అంటు వ్యాధులు ప్రబల కుండా ముందస్తుగా అవసరమైన చోట వైద్యశిబిరాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ అస్మా, ఎంపీహెచ్‌ఈవో సిద్దం సుధాకర్, యూ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ ప్రబలకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు, మందులు, టీకాలు, బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గుర్తించిన మురికినీటి నిల్వలు, పారిశుధ్యం లోపం వంటి ఫొటోలను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో స్థానిక వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తూ మృత్యువాత

కలువాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో దైవదర్శనానికి వెళ్తూ మండలంలోని వెంకటరెడ్డిపల్లి వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో అల్లూరు మాల్యాద్రి (54) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు, వింజమూరు మండలం కాటేపల్లికి చెందిన అల్లూరు చెంచులక్ష్మి అక్క కుమారుడు రాజుకి వివాహమైంది. అనంతరం సోమవారం ఉదయం దైవదర్శనానికి చెంచులక్ష్మి ఆమె భర్త మాల్యాద్రి, కొత్త దంపతులు రాజు, భవాని కలసి ఆటోలో పెంచలకోనకు బయలుదేరారు. జాతీయ రహదారి 565 వెంకటరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికి పంది అడ్డురాగా, డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చెంచులక్ష్మి, ఆమె భర్త మాల్యాద్రి గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం ఆత్మకూరుకి తరలించారు. అనంతరం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మాల్యాద్రి మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ చెప్పారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసులు


నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

కలువాయి, (ఆంధ్రజ్యోతి): స్థానిక మత్స్యకార సహకార సంఘానికి త్వరగా నూతన పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానించారు. మంగళవారం స్థానిక అంకమ్మరచ్చ వద్ద ప్రత్యేక అధికారి సంజయ్ స్టీఫెన్ అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన పాలకవర్గంతో పాటు చెరువులో చేపలు చోరీకి గురికాకుండా కాపాడుకునేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో చేసిన తీర్మానాలను జేడీ దృష్టికి తీసుకుపోయి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి తెలిపారు. సమావేశంలో కావలి ఏడీ శ్రీనివావాసులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. శవమై తేలిన బాలిక

కలువాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన కలువాయి దళితకాలనీకి చెందిన గోవిందు నిస్సీ (16) మంగళవారం సాయంత్రం తెలుగుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో శవమై కనిపించింది. పోలీసుల సమాచారం మేరకు, నిస్సీ ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకుని నిద్రిస్తుండగా స్కూటీ వేసుకుని వెళ్లిపోయిందని, అప్పటి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి దీవెనకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆ యువతి తీసుకెళ్లిన స్కూటీ ఉయ్యాలపల్లి సమీపంలో తెలుగుగంగ కాలువ గట్టుపై ఉండగా స్థానికులు గుర్తించారు. ఆమె మాత్రం అక్కడ కనిపించలేదు. దీంతో అందరూ కాలువల్లో పడి గల్లంతై ఉంటుందన్న అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా సోమవారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఎస్ఐ సుమన్ ఆ యువతి కోసం తెలుగుగంగ కాలువ వెంబడి గాలింపు చేపట్టగా సాయంత్రం గంగ రిజర్వాయర్‌లో శవమైతేలింది. నిస్సీ కలువాయిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గోవిందు దీవెనకుమారికి ముగ్గురు ఆడపిల్లలు, ఓ కుమారుడు. వీరిలో నిస్సీ మూడవ అమ్మాయి. కటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపంతో ఆ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి పోలీసులు కేసు దర్యాప్తు చేసున్నారు.





మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుమన్, గోవిందు నిస్సీ (ఫైల్)

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దు

అనంతసాగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇళ్ల మధ్యన మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వెంటనే అధికా రులు అడ్డుకోవాలని సీపీఎం నాయకులు అన్వర్‌బాష డిమాండ్ చేశారు. స్థానిక మహిళలతో కలసి తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి డీటీ సునీతకు వినతిపత్రం అందచేశారు.

8న మండల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతిని ధులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

తల్లిదండ్రులకు అవగాహన

సంగం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక రాళ్లచెలిక మిక్స్‌డ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోడను తొలగించండి

ఏఎస్ పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయబ్ రసూల్ దర్గా నుంచి ఉస్తాద్ బాబా, సర్దార్ బాబా దర్గాలకు వెళ్లే దారికి అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని మంగళవారం సీపీఎం నాయకులు దర్గా ఈవో మహమ్మద్ హశాసేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఐదేళ్ల క్రితం దారికి అడ్డంగా గోడను నిర్మించడంతో దర్గాలకు వెళ్లే భక్తుల తోపాటు శ్మశనానికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే గోడను తొలగించాలని కోరారు.

కొత్తపేటలో గ్రామసభ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై తహసీల్దారు వై.నాగరాజు, సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో నెలకొన్న తప్పిదాలపై అధికారులకు వినతులు అందజేశారు. వినతులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కరిష్మా, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్ బాబు వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక వైద్యశాలలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్, టీబీ సూపర్‌వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

కావలి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వంశపార్యంతో కేన్సర్ రావచ్చని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మీ తెలిపారు. మంగళవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేవీవీ, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కన్యాకుమారి, జేవీవీ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, హరినారప రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

దీక్ష సభను జయప్రదం చేయండి

కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు అంబేద్కర్‌భవన్‌లో ఈ నెల 24న బౌద్ధ దీక్ష ఉత్సవం నిర్వహించనున్నట్లు ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు గాండ్ల హరిప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సభలో అంబేద్కర్ - బుద్ధ అభిమానులు, ప్రజాస్వామికవాదులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ విడుదల

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట క్రిస్టియన్ గ్రౌండ్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కందుకూరులో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బొట్లగుంట శ్రీనివాస్, గుంటక మల్లికార్జున పాల్గొన్నారు.

రైల్వే ఎల్సీ గేటుకు అడ్డంగా ఆటోల నిలిపివేత

బిట్రగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు బజారు రైల్వే ఎల్సీ గేట్ 144 వద్ద పాంసిజర్ల కోసం రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలుపుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు నాల్గో లైన్ ప్రారంభమైనది మొదలు మంగళవారం అరగంటకు పైగా గేటు వద్ద ఉండాల్సి వస్తుందన్నారు. తీరా గేట్ తెరిచిన రెండు నిమిషాలకు మూసి వేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యతో గంటల తరబడి రైల్వే గేట్ వద్ద పడి కాపులు కాసి సమయానికి అనుకున్న ప్రాం తాలకు చేరుకోలేక పోతున్నామని చెబు తున్నారు. పోలీసులు స్పందించి ఆటో వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

● రెండు లారీలు, డ్రైవర్లు అదుపులోకి..

కావలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హద్దులు దాటిపోతున్న 55 కింటాల అక్రమ రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టణ మునునూరు టోల్ గేట్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పలనాడు జిల్లా వినుకొండ నుండి చెన్నైకు రెండు లారీల్లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు రూరల్ సీఐ రాజేశ్వరరావుకు వచ్చిన సమాచారం మేరకు టోల్ గేట్ వద్ద సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో బియ్యంతో వస్తున్న రెండు లారీలు, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకరంగా పెద్ద చెరువు తూము

● శిథిలావస్థలో తూము, కదిలిస్తే చెరువులో నీరు గల్లంతే
● సాగునీటి పారుదలపై రైతుల ఆందోళన

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కావలి పెద్ద చెరువు కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ చెరువు కింద సుమారు 2వేల ఎకరాల ఆయుకట్టు ఉంది. నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన రెండు తూములు దెబ్బతిని పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం చెరువులోకి సగానికిపైన నీరు చేరడంతో మరమ్మతుల చేయడానికి వీలులేని పరిస్థితి. ఈ సీజన్‌కైనా తూమును తెరచి నీరు పారించుకోవచ్చంటే అది చెరువుకే మరింత ప్రమాదకర పరిస్థితిగా నెలకొంది. తూమును కదిలిస్తే అది పూర్తిగా ఊడిపోయి చెరువుకు గండిపడి నీరంతా మృథాగా వెళ్లే పరిస్థితి ఉంది. ఈ సమస్యతో ఈ ఏడాది వరి సాగు ఎలా చేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని జలవనరుల శాఖ అధికారులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ల డమే



దెబ్బతిన్న చెరువు తూము

కాకుండా ఆదివారం నెల్లూరులో జరిగిన డీఆర్సీ మీటింగ్‌లో కూడా కావలి నియోజకవర్గంలో చెరువులు దెబ్బతిన్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే ప్రస్తుతం ఆ తూము కింద ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలంటే భగీరథ యత్నాలు చేయాల్సిందే. తూమును కదిలించకుండా దానికి లోపలవైపున వరిగడ్డి మోపులు, ఇసుకబస్తాలు లాంటివి వేసి తూము కొట్టుకుపోకుండా పటిష్టత పరచాలి. ఆ తర్వాత ఆ తూము నుంచి సాగునీరు పంటలకు లిఫ్ట్ ద్వారా అందిస్తేనే తూము వద్ద చెరువుకు రంధ్రం పడకుండా ఆ నీటిని సద్వినియోగం చేసుకునే పరిస్థితి ఉంది. చెరువు కట్టపై విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు కాని పెట్టి అక్కడ నుంచి ఆ కాలువకు నీటిని లిఫ్ట్ చేస్తే కింద ఉన్న పొలాలకు నీరు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ ఖర్చులు ఎవరు భరించాలన్నది చర్చనీయాంశంగా ఉంది.

ఉరూరా భక్తిశ్రద్ధలతో నాగులచవితి



ఉదయగిరి నాగులపుట్ట వద్ద భక్తుల పూజలు



సంగం: శివాలయంలో మహిళల పూజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి, గుడినరవ, మసీదుపల్లి, బిజ్జంపల్లి, ఉదయగిరిలోని సంతానలక్ష్మి, నగిరితోట ప్రాంతాల్లోని పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంచిపెట్టారు. గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

● దుత్తలూరు : గ్రామాల్లో మహిళలు నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నాగారప్పమ్మ శిలలు, పుట్టల వద్దకు వెళ్లి పోలుపోసి, దారాలు చుట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సంగం : మండలంలో మహిళలు ఉదయాన్నే తలస్నానాలు చేసి తడి దుస్తులతో పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి ఉప వాసం ప్రారంభించారు. అనంతరం ఇంటికి వచ్చి ప్రసాదాలు తయారు చేసుకుని నాగశిలలు, పుట్టల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

● ఆత్మకూరు : పట్టణంలోని శివాలయం, నాగేంద్రపురం, కాశీనాయన ఆశ్రమం, కొలగాని రామయ్యసత్రం, జ్యోతినగర్, ఎల్ఆర్ పల్లి, చెరువు, తదితర ప్రాంతాల్లో ఉన్న నాగులపుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఅలఘునాదస్వామి, కాశీనాయన ఆశ్రమ నాగశిలల వద్దకు మహిళలు అధికసంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు

● సీతారామపురం : మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. తెల్లవారుజాము నుండే పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తరలివచ్చారు.

● ఏఎస్ పేట : ఏఎస్‌పేటతో పాటు హసనాపురం, చిరమన, అనుమసముద్రం గ్రామాల్లో నాగులచవితిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఏఎస్‌పేట ఎర్రపోలలో ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

● అల్లూరు : అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో ఉండే నాగేంద్రుని పుట్టలు, చెరువు కట్టలు, కాలువ గట్లపై ఉండే నాగేంద్రుని పుట్టల వద్దకు మహిళలు చేరుకొని చలిపిండి, పాలు నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుండే మహిళలు మొక్కులను చెల్లించారు.

● వలేటివారిపాలెం : గ్రామాల్లో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేసి, నోముల దారాలు, చలిపిండి తయారు చేసుకొని పుట్టలు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు కంకణాలు ధరించారు. నాగ పంచమి వరకు ఉపవాస దీక్షలు కొనసాగించి పుట్టలో పాలు, కొబ్బరి, బెల్లం వేసి దీక్షను విరమించారు.

● కావలి టౌన్ : స్థానిక ము సునూరు ట్రంకురోడ్డు పుట్ట, కోర్టు ప్రాంగ ణం లోని పుట్ట, వెంగళరావునగర్ ఆలయ ప్రాం గణం, ఉత్తరంపేట ట్రంకురోడ్డులోని పుట్టల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టకు దారాలు చుట్టి పాలు పోసి పూజలు నిర్వహించారు. సలిపిండి, నువ్వులు, వడపప్పు నాగదేవతకు నైవేద్యం సమర్పించారు.

● కావలి రూరల్ : వైకుం ఠపు రం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులోని నాగదేవత సమేత జంట నాగేంద్రస్వామి పుట్ట మందిరంలో దగ్గుపాటి ప్రభాకర్, నాగయ్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే మహిళలు పుట్ట మందిరానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

● బిట్రగుంట : విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరుశివారులోని నాగవర పమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ సమీపంలోని నాగుల పుట్ట వద్ద పాలు, గుడ్లను ఉంచారు. సలివిడి, సొజ్జులు, పులిహోరాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. బోగోలు బజారు కూడలోని నాగులపుట్ట, ఇబ్రహీంపేట శివాలయ ఆవరణలోని నాగశిలకు పూజలు నిర్వహించారు. గంగతిప్ప శివలింగానికి పూజలు చేశారు.

● ఉలవపాడు : గ్రామ పొలిమేరల్లోని నాగేంద్ర స్వామి పుట్టలకు పసుపు కుంకమలతో పూజలు చేసి పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని మహిళలు, నాగదోషం, కుజదోషం ఉన్న మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఉలవపాడు దక్షణ బైపాస్ వద్ద వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి పుట్టకు పూజలు చేసి పాలు, నైవేద్యం సమర్పించారు.



కావలి: పూజలో పాల్గొన్న భక్తులు



బిట్రగుంట: పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



సీతారామపురం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వలేటివారిపాలెంలో పూజలు చేస్తున్నమహిళలు

పొదుపు గ్రూపు సభ్యుల సమగ్ర సమాచారం పొందుపరచాలి : మెప్మా పీడీ

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎస్‌జీహెచ్ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ సమావేశం మందిరంలో పొదుపు సంఘాల రీసోర్స్ పర్సన్స్‌కు ఎస్‌జీహెచ్ ప్రొఫైల్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళా సంఘాల పొదుపులు, అప్పు వివరాలతో పాటు ఎస్‌జీహెచ్ సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమాచారం ఉండాలన్నారు. రీసోర్స్ పర్సన్స్ సమాచారం పొందుపరిచేందుకు కృషిచేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీలో ప్రతి సంఘం సభ్యురాలి సమగ్ర సమాచారాన్ని సేకరించి ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం భారతి, జిల్లా స్థాయి మెప్మా సిబ్బంది అంకయ్య, కాంతయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర, కమిషనర్ శ్రావణ్‌కుమార్

● కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపుల్లో అవకతవకల నివారణకు ప్రభుత్వం నూతన యాప్‌ను ప్రవేశపెట్టిందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. కందుకూరు మున్సిపాలిటీలో పొదుపు గ్రూపుల ఆర్పీలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైలింగ్ యాప్ వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న పీడీ రవీంద్ర యాప్ వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, మెప్మా సీఎంఎం సంపత్‌కుమార్, సీఓలు మాధవీలత, సురత్న, డీఈఓ శ్రవణ్‌కుమార్, ఆర్పీలు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

శుభ్‌దిన్ భోజనం ఏర్పాటు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు మంగళవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తన జన్మదినం సందర్భంగా శుభ్‌దిన్ భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులకు రుచికరమైన భోజనంతోపాటు పండ్లు, మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్రవీణ్, నాగేంద్ర, యోగేంద్ర, చందు, శ్రీకాంత్, సీనియర్ ఇంటర్ హేమంత్‌లు ఉన్నారు. 9, 10, 11 తేదీల్లో విజయవాడ పోటీల్లో పాల్గొంటారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అభివృద్ధి చేసి మాట నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, నవంబరు 5: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ముసునూరు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనులు ట్రంకురోడ్డు వరకు, కన్‌కెవిటి రోడ్డు, డ్రైన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడవద్దని ప్రజలకు ఇబ్బంది కల గకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లకు సూచించారు. పనులు పూర్తయితే రైల్వే ట్రాక్ అవల నివాసితులకు, పట్టణానికి రాకపోకలు సాగించేందుకు తుమ్మలపెంట మార్గంలో తీరప్రాంతవాసులకు, బీచ్‌కు వెళ్లే సందర్శకులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి గ్రామ పెద్దలు, నేతలు తదితరులు ఉన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చాలి : జిల్లా టీబీ అధికారి ఖాదర్‌వలి

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ఇంటింటి సర్వే చేపట్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో వారికి వైద్య పరీక్షలు చేయించాలని అడిషనల్ డీ ఎంహెచ్‌వో, జిల్లా టీబీ నివారణ అధికారి ఖాదర్‌వలి ఆశాలకు దిశా నిర్దేశం చేశారు. ఆశా డే సందర్భంగా మంగళవారం కరేడు పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నేషనల్ ట్యూబర్‌క్లోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రాం(ఎన్‌టీఈపీ)లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి రెండువారాలకు పైగా దగ్గు, జ్వరము ఉన్న వారి నుంచి గళ్లను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. ఆశాలను టీములుగా విభజించి బుధవారం నుంచి ఇంటింటి సర్వే చేపడతామని కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు.

రీసర్వే ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశాం..

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో రీ సర్వే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె వార్డు సచివాలయ సర్వేయర్లు, ఇతర సిబ్బందితో సమావేశం అయ్యారు. తక్షణం రీసర్వే ప్రక్రియను ప్రారంభించాలని ఆదే శాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాల మేరకు ఆయా ప్రాంతాల రైతులు, భూ యజమానులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ప్రజలు కూడా తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను రీసర్వే సిబ్బందికి చూపించి స్థలాలు, భూముల రీ సర్వేకు సహకరించాలన్నారు.

ఆత్మకూరును ప్రథమస్థానంలో నిలపాలి : మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీ డీపీ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేం దు కు పార్టీ నేతలంతా ప్రత్యేక దృష్టి సారించాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల కన్వీనర్లు, నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లుకు ఆమన దిశానిర్దేశం చేశారు. టీడీపీ సభ్యత్వ నమోదుకు రాష్ట్రంలో 10 నియోజకవర్గాలను ఎంపిక చేయగా, ఇప్పటికే కళ్యాణదుర్గం ప్రథమ స్థానంలో, ఆత్మకూరు ద్వితీయ స్థానంలోనూ ఉందన్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ప్రథమస్థానంలో ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి అన్ని పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బుల్లెట్ రమణ, కార్తీక్, నాయకులు బొల్లినేని గిరినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రీ సర్వేలో తప్పులను సవరిస్తాం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో జరిగిన తప్పులను సవరి స్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జరిగిన గ్రామసభలో 44 మంది రైతులు అర్జీలు ఇచ్చారన్నారు.

తలసేమియా ఆసుపత్రి ఏర్పాట్ల పరిశీలన

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు చేయటం కావలి ప్రాంత ప్రజలకు ఒక వరమని కావలి ఆర్డీవో, రెడ్‌క్రాస్ కన్వీనర్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ రక్తనిధి భవనం, త్వరలో ప్రారంభం కానున్న తలసేమియా ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహ ణకు రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ హరి నారపరెడ్డి రూ.1.9లక్షలు, ప్రముఖ బిల్డర్ దేవ రపల్లి మధుసూదనరెడ్డి రూ.లక్ష116ల చెక్కులను ఆర్డీవోకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రా స్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్, ఛైర్మన్ డీ రవిప్రకాష్, రొటేరియన్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



భవన మరమ్మతులకు ప్రతిపాదనలు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాత ఎంపీడీవో కార్యాలయ భవన మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం సిబ్బందితో కలిసి భవనం కొలతలు తీయించారు. భవనానికి సంబంధించిన కలప, తదితర సామగ్రిని గుర్తించి రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో భవనానికి మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు షరీఫ్, వెంకటేష్, నరసింహ, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● గోపీనాథ్, మర్రిపాడు ప్రభుత్వ వైద్యాధికారి



మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి) : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిపాడు ప్రభుత్వ వైద్యాధికారి గోపీనాథ్ సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

? మండలంలో జ్వర పీడితుల సంఖ్య పెరగడానికి కారణం.

! వాతావరణంలో మార్పులు.. భూగర్భ జలాలు కలుషితం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

? జాగ్రత్తలు ఏంటి

! కాచిన నీటిని తాగితే అనారోగ్యం చెంతకు రాదు.

? ఆరోగ్యం పట్ల అవగాహన కార్య క్రమాలు నిర్వహి స్తున్నారా.

! ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

బహుమతుల అందజేత



ప్రయాణికులకు బహుమతి అందజేస్తున్న డీఎం శ్రీనివాసరావు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతారామపురం మార్గం లో తిరిగే బస్సులకు సంబంధించి గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా విజేతలైన ప్రయాణికులకు మంగళవారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో ప్రయాణికులు టికెట్లు వేశారు. ఆ టిక్కెట్లను డ్రా తీయగా మహేంద్ర, నిఖితలు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై గ్రామసభ

సీతారామపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతారామపురం-1 సచివాలయంలో మంగళవారం సర్పంచి భాగ్యకుమారి అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భం గా టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాదికి నూతన పనుల కోసం ప్రతిపాదనలు పంపుతామని, రైతులు పండ్ల తోటల పెంపకం, మునగ నర్సరీలు, పూలతోటల పెంపకం వంటి పనులకు ప్రతిపాదనలు తయారు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షఫీ, వెల్ఫేర్ అసిస్టెంట్ హసనయ్య, మహిళా కార్యదర్శి హజీర బేగం, వార్డు మెంబర్ తోట మనోజ్‌బాబు, రవి,ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాల్యాద్రి, నరసింహం

లింగసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాలకొండ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు మట్టె నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా జంపాలవారిపాలెం పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఆయన కుమారులు మాల్యాద్రి, నరసింహారావులు చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బంధువులు పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

వరికుంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీలో పంటలు సాగు చేసిన రైతులు డిసెంబరు 15వ తేదీలోపు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామాపురం, వరికుంటపాడు గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, కిశోర్, రైతులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవం బరు 5 (ఆంధ్రజ్యోతి): నందిపాడు సెంటర్ లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై మంగ ళవారం ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. 16 సీసాలను స్వాధీనం చేసుకుని బత్తుల వేణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధునిక పద్ధతులపై దృష్టి

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతు లపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి రైతులకు సూచించారు. మంగళవారం వీరేపల్లి ఆర్ఎస్‌కేలో నిర్వహించిన పొలం పిలుస్తుందిలో ఉద్యానవన అధికారి జ్యోతి వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లెనిగల్ ఆసుపత్రిలో లివర్ మార్పిడి చికిత్సలు

● ప్రముఖ వైద్య నిపుణుడు రజనీకాంత్

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చెన్నై గ్లెనిగల్ ఆసుపత్రిలో జిల్లావాసులు 30 మందికి లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. మంగళవారం గ్లెనిగల్ ఆసుపత్రి నెల్లూరు నగర విభాగంలో ఆయన మాట్లాడారు. లివర్ మార్పిడి అవసర మైన వారందరూ సిర్రోసిస్, లివర్ కేన్సర్ బాధితులేనని తెలియచే శారు. హెపటైటిస్ బీ, సీ, ఫ్యాటీ లివర్, కొన్ని జన్యుపరమైన కారణాలు ఉన్నవారు తప్పనిసరిగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించు కోవాలని సూచించారు. బూజుపట్టిన వేరుశెనగలు, ఊరగాయలలో ఉండే ఫంగస్ వల్ల లివర్ కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నెల్లూరు కేంద్రం అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.


తాగునీటి బావిలో పూడికతీత

విడవలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో పూడిపోయిన తాగునీటి బావి పూడికతీత కార్యక్రమం చౌకిచర్ల దళితవాడ లో మంగళవారం జరిగింది. ఇటీవల చౌకిచ ర్లకు వచ్చిన ఎమ్మెల్యేకి తాగునీటి బావి పూడి పోయిన విషయాన్ని స్థానికులు ఆమె దృష్టికి తేవడంతో స్పందించిన ఆమె సర్పం చుతో చెప్పి బావి పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమ్మిరెడ్డి కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన శబరిగిరి
గురునాథ క్షేత్రం

● తుమ్మగుంటలో స్వయంభు అయ్యప్ప క్షేత్రం
● కలియుగ దైవంగా పూజలందుకుంటున్న హరిహర సుతుడు
● కార్తీక మాసంలో వేలాది మంది భక్తుల మాల ధారణ

స్వామియే.. శరణం అయ్యప్ప





తుమ్మగుంటలోని అయ్యప్ప ఆలయం, జువ్వి చెట్టులో స్వయంభుగా అయ్యప్పస్వామి ఆకృతి

విడవలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకిచర్ల పంచాయతీ తుమ్మగుంట ప్రాంతంలో వెలసివున్న గురునాథస్వామి (అయ్యప్ప) ఆలయం దక్షిణ శబరిమలగా విరాజిల్లుతోంది. ప్రతి ఏటా కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు ఈ ఆలయానికి విచ్చేసి మాలాధారణ చేస్తారు. జువ్వి చెట్టులో స్వయంగా అయ్యప్ప వెలసిన పుణ్యక్షేత్రం కావడంతో ఈ ఆలయంలో మాల ధరిస్తే సకల దోషాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. 1938లో కంచి కామకోటి పీఠాధిపతులు, కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, శివచిదానంద భారతి స్వామి తుమ్మగుంటకు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తుమ్మగుంట పుణ్యక్షేత్రం ప్రతి బుధవారం అయ్యప్ప భక్తులతో శోభాయమానంగా ఉంటుంది.

● ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రతి ఏటా కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రధానంగా లక్ష దీపార్చ న, గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15న దేవాల యంలో మకరజ్యోతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి భజనలు చేస్తారు.

● కోవూరు ఎమ్మెల్యే దాతృత్వం

తుమ్మగుంటలో వెలసివున్న అయ్యప్ప స్వామి ని దర్శించుకోనే భక్తులకు అసౌర్యం కలుగకుండా మరుగుదొడ్లు, స్నానపు గదుల మరమ్మతులకు, పారిశుధ్య పనులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.2లక్షలను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల ఆలయాధికారులకు అందజేశారు.



గురునాథ క్షేత్రంలో అయ్యప్ప మాల ధరిస్తున్న భక్తులు

స్వామివారి సేవలో తరిస్తున్నాం



అయ్యప్ప స్వామికి మా కుటుంబీకులు ఎన్నో ఏళ్లగా సేవ చేస్తున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 15న స్వామివారి ఉత్సవాలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, గ్రామస్థుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

- యర్రంరెడ్డి సుధాకర్‌రెడి, ఆలయ అపద్ధర్మ చైర్మన్

జిల్లా క్రీడాకారులకు ఫిడే రేటింగ్



క్రీడాకారులను అభినందిస్తున్న సుమన్

నెల్లూరు(విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన ఏడుగురు చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ రేటింగ్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో ఉన్న ఆర్ఎల్ఎస్ చెస్ అకాడమీలో అభినందన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి వై సుమన్ మాట్లా డుతూ ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫిడే) హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిడే క్లాసికల్ రేటింగ్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు అత్యుత్త మ ప్రదర్శన ఇవ్వడంతో ఫిడే జారీ చేసిన రేటింగ్ జాబితాలో వారికి చోటు లభించిందని చెప్పారు. వీ హరీష్‌మన్, పి సిద్దేష్, టీ.అయూష్, ఎం.దార్మిక్ సాయి, జే సహస్ ప్రిన్స్, ఈ కీర్తిసాయి, కే సాయిశ్రీహర్ష ఈ రేటింగ్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోచ్‌లు రామ్, లక్ష్మణ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చౌకిచర్లలో రెవెన్యూ సదస్సు

విడవలూరు, నవంబరు 5(ఆంధ్రజోతి): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని రీసర్వేలో ఉన్న తప్పులను సరిదిద్దుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి తెలిపారు. చౌకిచర్లలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఏ వినోద్, రీసర్వే డీటీ విజయకుమార్, మండల సర్వేయర్ మస్తాన్‌బాషా, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ, బీజేపీ నాయకులు ఈదూరు సురేష్, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి

'సాగరమాల'పై రైతుల ఆందోళన

ముత్తుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొయ్యలపాలెం వద్ద సాగరమాల రోడ్డుపై రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు వల్ల తమకు సాగునీరు అందించే లిఫ్టు ఇరిగేషన్ పైపులైన్ దెబ్బతినిందని తెలిపారు. గత సీజన్‌లోనూ సాగునీరు లేక ఇబ్బందిపడ్డామని, అప్పట్లో లిఫ్ట్ ఇరిగేషన్ పైపు లైన్ సక్రమంగా వేసి రోడ్డు నిర్మించుకోవాలని, నిర్మాణ పనులు చేస్తున్న ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధులు, అధికారులతోనూ చెప్పామన్నారు. తమ విజ్ఞప్తిని పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణం పనులు చేయడంతో పైపులన్నీ దెబ్బతిని తాగునీరు అందకుండా పోయిందన్నారు. ఆరు నెలల నుంచి తమ సమస్యను అధికారులు, కంపెనీ ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం నార్లు పోసుకుందామంటే సాగునీరు లేని పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పైపులైన్ మరమ్మతుఢ చేస్తామంటున్నారని, దీనికి తాము అంగీకరించబోమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పైపులైన్ ఏర్పాటు చేసి తమ పొలాలకు సాగునీరు వచ్చేలా ప్రత్యామ్నాయ మార్గం చూపేవరకు రోడ్డు పనులు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యను పరిష్కరిస్తామని పనులు అడ్డుకోవద్దని కంపెనీ ప్రతినిధులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆందోళన విరమించేందుకు అంగీకరించలేదు.



కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న రైతులు

గర్భిణులకు పారితోషికం అందించాలి

ఇందుకూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గర్భి ణులకు అందిస్తున్న ఆర్థిక పారితోషకం సకాలంలో అందేలా చూడాలని జగదేవిపే ట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ఆశా డే సమావేశం డిస్ట్రిక్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ పి.షైనీ ఆశా వలంటీర్ల విధివిధానా లను వివరించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, షేక్.జావీద్, టీబీ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నిరవధిక సమ్మె

● కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

నెల్లూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు చెప్పుకునేందుకు కూడా వీలులేకుండా నిర్బంధించడం సరికాదని, త్వరలో నిరవధిక సమ్మె చేపడతామని మున్సిపల్ కార్మికులు ప్రకటించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. లోపల కౌన్సిల్ సమావేశం జరుగుతుండటంతో పోలీసులు ప్రధాన గేట్ల వద్దే ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో కమిషనర్ తమ వద్దకు వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూల స్పందన రాకపోవడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం, స్వల్ప తోపులాట జరిగాయి. అనంతరం రోడ్డుపై బైఠాయించిన కార్మికులు, నాయకులు అధికారుల తీరుపై మండిపడ్డారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్ స్థాయిలోనే తీరే సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు సుముఖత చూపడం లేదని విమర్శించారు. 30 రోజులు కార్మికులు పని చేస్తుంటే 24 రోజులకే జీతం ఇస్తున్నారని ఆరోపించారు. తమ యూనియన్‌లో చర్చించి సమ్మె తేదీలను ప్రకటిస్తామన్నారు. అనంతరం నగర డీఎస్పీకి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచల నరసయ్య, సూర్యనారాయణ, శ్రీనివాసులు, రమణారెడ్డి, మాలకొండయ్య పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఖర్చులేకుండా పేదలకు ఆపరేషన్లు

నెల్లూరు రూరల్. నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :పేదలకు రూపాయి ఖర్చులేకుండా శస్త్రచికిత్సలు చేయించినట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధం గా నెల్లూరు రూరల్ నియోజ కవర్గంలో ప్రత్యే కంగా నిర్వహిస్తున్న నారా లోకేష్ ఆరోగ్యరక్ష కార్యక్ర మం మంచి ఫలితాలనిస్తోందన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించు కున్న వారిని మంగళవారం ఆయన పరామర్శిం చారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఇటీవల మండలంలోని గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామాల్లో 'ఆరోగ్యరక్ష' శిబిరాలు నిర్వహించామని, వాటిలో గుర్తించిన ఇద్దరు పిల్లలకు వినికిడి ఆపరేషన్లు, మరో చిన్నారికి ముక్కు శస్త్ర చికిత్స, మరి కొందరికి మోకీ లు, గుండె ఆపరేషన్లను రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో విజయవం తంగా చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఆసుపత్రి ప్రతినిధు లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు 1వ డిపో పరిధిలో నెల్లూరు-బుచ్చి మార్గంలో ప్రయాణించే వారికి గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా మంగళవారం లక్కీడిప్ నిర్వహించి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కోవూరుకు చెందిన ఇందిరా నాగలక్ష్మి, బుచ్చికి చెందిన సత్రాజ్, శ్రీనివాసరావుకు బహుమతులు అందించామని తెలిపారు.

● హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో మంగళవారం ఆర్టీసీ, ప్రైవేటు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డుపై సిగ్నల్స్ తప్పక పాటించాలని, ప్రమాదరహితంగా వాహనాలు నడపాలని సూచించారు.

కలెక్టర్‌తో నర్సింగ్ సంఘం భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ నేతలు మంగళవారం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సత్యవతి, వసుంధర, ఉపాధ్యక్షురాలు సుమతి, సభ్యులు నిర్మల జ్యోతి, రాధ, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

కాశీ ఘాట్‌లా గణేష్ ఘాట్

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వర్ణాల చెరువు తీరాన ఉన్న గణేష్ ఘాట్‌లో ఈ నెల 15న కార్తీక మహా దీపోత్సవాన్ని కాశీ కాళీ ఘాట్‌ను తలపించేలా నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజతో కలిసి కార్తీక మహా దీపోత్సవం ఏర్పాట్లను పరిశీలిం చారు. కార్తీక మహా దీపోత్సవం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సింహపురి లక్ష దీపోత్సవ సమితి ఆహ్వాన పత్రికలను ఇంటింటికి పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు. దీపోత్సవానికి భారీగా తరలివచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఆ రోజు గోపూజ, అభిషేకాలు, శోభాయా త్ర, దీపారాధన అనంతరం 108 పడవలతో ప్రత్యేకంగా శివలింగం అలంకార దర్శనం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్తీక దీపోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జయప్రద, కార్పొరేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో చెత్తాచెదారాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి స్కూలు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాలను మంగళవారం అధికారులు తొలగింపచేశారు. అలాగే జొన్నవాడలోని టీటీడీ సత్రం వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి పెన్నా నదీ తీరంలో డంపింగ్ యార్డును తలపిస్తూ దుర్గంధం వెదజలుతున్న చెత్తను గ్రామ పంచాయతీ అధికారి కావేరి, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేస్తున్న వారికి నోటీసులు ఇచ్చినట్లు గ్రామ పంచాయతీ అధికారి తెలిపారు. అలాగే నదీ తీరంలో పందుల పెంపకంపై వాటి యజమానులకు నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం' కథనానికి స్పందించిన కలెక్టర్ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాల తొలగింపు, పందుల సంచారంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. పెనుబల్లి పాఠశాల ప్రాంతంలో ఒక డస్ట్ బిన్ ఏర్పాటు చేసి అందులో చెత్త వేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్కూలు వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

భక్తిశ్రద్ధలతో నాగుల పుట్టకు పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి, రేబాల, పంచేడు, మినగల్లు, కాగులపాడు, దామరమడుగు తదితర గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి సందర్భంగా నాగుల పుట్టల వద్ద పూజలు చేశారు.

● ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న పుట్ట దగ్గరికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని నాగేంద్రుడికి పాలు పోసి పూజలు చేశారు. మహిళలు పుట్ట చుట్టూ చీరలు కప్పి, దారాలు చుట్టారు.

● పొదలకూరు(ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్ట ణంలోని పలు ప్రాంతాలతో పాటు పల్లెల్లో నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. భక్తులు పుట్ట దగ్గరికి వెళ్లి నాగేంద్రుడికి పాలు పోసి, మొలకెత్తిన సజ్జలు, చలిమిడి పిండి, చిమ్మిలి నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పుట్ట దగ్గర దీపావళి తరహాలో బాణాసంచా కాల్చి సందడి చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పట్టణంలోని శివాలయంలో రావిచెట్టు కింద వెలిసి ఉన్న నాగశిలలకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

● మనుబోలు(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్ద చెరువు వద్ద వెలసి ఉన్న నాగులపుట్టకు అధికసంఖ్యలో మహిళలు పూజలు చేశారు. పుట్టకు సమీపంలో ఉన్న గ్రామదేవత మనుబోలమ్మ, నాగా రమ్మ, గంగమ్మ ఆలయాల్లోనూ అమ్మవార్లకు ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి.

● తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగుల చవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

● సైదాపురం(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పుట్టల వద్దకు చేరుకుని పాలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నెల్లూరు(క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్తింటివారిపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరక.. మూలాపేట సీఏఎం స్కూలు ప్రాంతానికి చెందిన సమీనాకు రెండేళ్ల కిందట అనంతసాగరం మండలం మినిగల్లు గ్రామానికి చెందిన మస్తాన్‌తో వివాహమైంది. వివాహ సమయంలో ఆమె కుటుంబ సభ్యులు రూ.50 వేల నగదు, 5 సవర్ల బంగారం కట్నకానుకులగా మస్తాన్ కుటుంబానికి ఇచ్చారు. కొద్ది రోజులు వారి కాపురం సజావుగా సాగినా అత్తింటివారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. కొంతకాలం కిందట సమీనాను ఇంటి నుంచి గెంటేశారు. దీంతో బాధితురాలు మంగళవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజమన్నార్

నెల్లూరు (వైద్యం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజమన్నార్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం ప్రకాశం జిల్లా మార్కాపురంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అయితే అక్కడ ఇంకా కళాశాల ప్రారంభం కాకపోవడంతో డాక్టర్ రాజమన్నార్‌ను ప్రభుత్వం నెల్లూరుకు బదిలీ చేసింది.

డిసెంబరు 21, 22న ప్రీ క్రిస్మస్

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు క్రిస్మస్- 2024 వేడుకలు డిసెంబరు 21, 22తేదీలలో వీఆర్సీ మైదానంలో నిర్వహిస్తున్నామని పాస్టర్ వినోద్ ప్రకాష్, కన్వీనర్ నవీన్‌ప్రకాష్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 300 మంది పాస్టర్లతో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

న్యూస్ బాక్స్

సౌర విద్యుత్‌పై ప్రచారం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్‌ను ప్రజలంతా వినియోగించుకునేలా విద్యుత్ శాఖ నగర అధికారులు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. స్థానిక సచివాలయాలు, పాఠశాలల్లో ఈ ప్రచారం నిర్వహించారు. టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సునీల్, కిరణ్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌తో బిల్లుల భారం తగ్గడమే కాక విద్యుత్ కొరత తీరుతుందని చెప్పారు. ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నందున తక్కువ ధరకే సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు దామోదర్‌రెడ్డి, లక్ష్మీబాయి, విజయ్, సుధాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా కన్నా

మనుబోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడుగా మనుబోలుకు చెందిన కన్నా సుబ్రహ్మణ్యంను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని బీసీ కులాలను చైతన్యపరుస్తూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేసేందుకు తమ సంఘం ముందుంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు యనమల అంకయ్య తెలిపారు.

డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షకు 371 మంది గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 371 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 5,695 మంది విద్యార్థులకు గాను 5,324 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

మాలల సంక్షేమానికి కృషి

● మహానాడు జిల్లా అధ్యక్షుడు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మాలల సంక్షేమానికి కృషి చేస్తామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకట రమణ తెలిపారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాలలకు అందేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో కుదిరి రామకృష్ణను మాలమహానాడు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పత్రం అందచేశారు.

వైద్య ఆరోగ్యశాఖలో వాహనాల వేలం

నెల్లూరు (వైద్యం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను వేలం వేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిని ఈ-వే లం ద్వారా విక్రయిస్తామని వివరాలకు https//konugolu.ap.gov.in పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

దొడ్ల నరసింహారెడ్డి కన్నుమూత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరుకు చెందిన ఆంధ్ర రాష్ట్రానికి మొదటి సీఎం బెజవాడ గోపాల్‌రెడ్డి మేనల్లుడు దొడ్ల నరసింహారెడ్డి (96) మంగళవారం రాత్రి కన్ను మూశారు. ఆయన నేత్రాలను ఆయన కోడలు, మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి, కొడుకు కోదండ రామిరెడ్డి దంపతులు సమాచారంతో మోడరన్ ఐ ఆసుపత్రి సిబ్బంది సేకరించారు.

చిన్నారికి తప్పిన ప్రాణాపాయం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లోని గుడపల్లి కాలువలో మంగళవారం ప్రమాదవశాత్తు పడిన ఓ చిన్నారిని స్థానిక ఓ యువకుడు కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. ఖాజానగర్‌లో జమీలా మహల్ వెనుక వీధిలో ఉన్న గుడపల్లి కాలువకు పక్కనే సీసీ రోడ్డు వేశారు. దానికి రక్షణగోడ లేదు. రోడ్డు పక్కనే ఉన్న కాలువ 6 నుంచి 8అడుగుల లోతు ఉంది. మంగళవారం ఓ చిన్నారి రోడ్డుమీద వెళ్తూ కాలువలో పడ్డాడు. గమనించిన ఓ యువకుడు వెంటనే కాలువలో దిగి చిన్నారిని కాపాడడంతో ప్రాణాపాయం తప్పిందని చిన్నారి తలిదండ్రులు బంధువులు తెలిపారు.

ఈసీసీఈతో పిల్లల వివరాలు నమోదు

నెల్లూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్య వివరాలు నమోదు చేయడం, ఆరేళ్ల వరకు ఆట, పాటలను నేర్పించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప తెలిపారు. మంగళవారం నెల్లూరు ప్రాజెక్టు పరిధిలోని అంబాపురం, బుజబుజనెల్లూరు కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఆరేళ్ల వరకు అంగన్‌వాడీల్లోనే ఉంచాలని కోరారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏపీఎం - 9985411424

అమానవీయ రాజకీయం



బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ
పరామర్శల పేరుతో హడావుడి
వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం 6

ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ

● పుత్తూరు కోర్టులో విష్ణును హాజరు పరిచిన పోలీసులు 6

స్నేహితుడి కుటుంబంపై ఆటో డ్రైవరు హత్యాయత్నం

● శ్రీకాళహస్తి పట్టణంలో కలకలం





కొలువుదీరనున్న కొత్త బోర్డు

నేడు టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు, 17 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త పాలక మండలి కొత్త అధ్యక్షుడు బీఆర్ నాయుడు, 17 మంది సభ్యులు నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో వీరు బాధ్యతలు స్వీకరిస్తారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండో మెంట్ కమిషనర్ సత్యనారాయణ కూడా నేడు ప్రమాణం చేస్తారు. తొలుత చైర్మన్, అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకార పత్రాలపై సంతకాలు చేశాక స్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం రంగనాయకుల మండపంలో వీరికి శేషవస్త్రాలు కప్పి వేద ఆశీర్వచనం చేస్తారు. కాగా సాయంత్రం అన్నమయ్య భవనంలో కొత్త పాలక మండలి మీడియా మీట్‌లో పాల్గొంటుంది. ప్రమాణస్వీకారానికి తగిన ఏర్పాట్లను టీటీడీ ఇప్పటికే పూర్తి చేసింది.

ఈ ప్రమాణస్వీకారం కోసం చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. తన సొంతూరైన పెనుమూరు మండలం దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు చేశారు. తిరిగి తిరుమల చేరుకున్నారు. దారి పొడవునా ఆయనకు ఘన స్వాగతం లభించింది.

వీరికి మళ్లీ అవకాశం

తాజా బోర్డులో మరోసారి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయబోతున్నవారిలో కృష్ణమూర్తి వైద్యనాథన్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, సౌరభ్ బోరా, సుచిత్ర ఎల్లా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఇక, మహారాష్ట్రకు చెందిన సౌరభ్ బోరా చివరి రెండు బోర్డుల్లో సభ్యుడిగా కొనసాగారు. అలాగే భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు. ఇక, కేంద్ర హోం మంత్రికి సన్నిహితుడుగా పేరున్న చెన్నైకు చెందిన కృష్ణమూర్తి వైద్యనాథన్ 2015 నుంచి వరుసగా(ఐదుసార్లు) టీటీడీ బోర్డులో కొనసాగుతున్నారు.



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతున్న విజిలెన్స్, రిసెప్షన్ అధికారులు

వారసులుగా ఇద్దరు

తిరుప్పూర్ బాలుగా పేరున్న బాలసుబ్రహ్మణియన్ పళనిస్వామి గత ప్రభుత్వంలో సభ్యుడిగా ఉన్నారు. అయితే ఈసారి ఆయన సోదరుడు రామ్మూర్తి బోర్డులో అవకాశం దక్కించుకున్నారు. అలాగే గత బోర్డులో సభ్యుడిగా ఉన్న కేతిన్ దేశాయ్ కుమారుడు, కుసుమ్ ధీరజ్‌లాల్ ఆస్పత్రి ఎండీ అదిత్ దేశాయ్ కి ఈసారి అవకాశం లభించింది.

కొత్త బోర్డులో వీరు..

నూతన బోర్డులో టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి(కోవూరు) ఎంఎస్ రాజు(మడకశిర) స్థానం దక్కించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి తో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా కూడా కొత్త పాలకమండలిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని రఘుదేవపురానికి చెందిన అక్కిన మునికోటేశ్వరరావు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన జంగా కృష్ణమూర్తి, కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి వైద్యం శాంతారాం, మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి కూడా సభ్యులుగా నియమితులయ్యారు. ఇక జనసేన నుంచి పవన్‌కల్యాణ్ సన్నిహితుడు, తెలంగాణ జనసేన ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, పవన్‌కల్యాణ్ స్నేహితుడు బూరగాపు ఆనంద్‌సాయి, జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి కొత్త బోర్డులో చోటు లభించింది. అలాగే ఫార్మా రంగంలో ఉన్న నాట్కో గ్రూప్ వైస్ చైర్మన్ సన్నపనేని సదాశివరావు, ఎన్‌ఆర్‌ఐ జాస్తి పూర్ణసాంబశివరావు, కర్ణాటక పారిశ్రామికవేత్తలు నరేష్‌కుమార్, కాఫీ రంగంలో ప్రముఖుడైన ఆర్ఎన్ దర్శన్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి హెచ్ఎల్ దత్ సభ్యులుగా నియమితులయ్యారు. ఇక, తమిళనాడుకు చెందిన రామ్మూర్తి, ఎంసీఐ చైర్మన్‌గా పనిచేసిన గుజరాత్‌కు చెందిన కేతన్ దేశాయ్ కుమారుడు అదిత్‌దేశాయ్, మహారాష్ట్రకు చెందిన ఆర్థిక నిపుణుడు సౌరభ్ బోరా, కేంద్రమంత్రి అమిత్ షా సన్నిహితుడు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా సభ్యులుగా స్థానం దక్కించుకున్నారు. స్థానికంగా ఉంటూ శ్రీవారి భక్తుల సమస్యలపై నిరంతరం స్పందించే బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కూడా నూతన బోర్డులో ఉన్నారు.

వైసీపీలో వివాదాల బోర్డులు

జగన్ ప్రభుత్వంలో టీటీడీ పాలకమండలి నియామకాలు వివాదాలమయం అయ్యాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించారు. 2019 జూన్ 22న వైవీ బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల తర్వాత టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అప్పట్లో ప్రభుత్వం 24 మంది సభ్యులు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఏడుగురు ప్రత్యేక ఆహ్వానితులతో బోర్డును ఏర్పాటు చేయటంపైనా పలువురు భక్తులు విమర్శలు చేశారు. అందులోనూ ప్రత్యేక ఆహ్వానితులతో కూడా ప్రమాణస్వీకారం చేయించి నూతన పద్ధతికి తెరతీశారు. 2021లో కేంద్ర క్యాబినెట్‌ను తలపించేలా వైసీపీ ప్రభుత్వం జంబో బోర్డును ఏర్పాటు చేయడంపై కూడా తీవ్రస్థాయిలో దుమారం రేగింది. రాజకీయ పునరావాస కేంద్రంగా టీటీడీని మారుస్తూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి 29 మంది సభ్యులు, మరో 52 మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఏకంగా 81 మందితో బోర్డును నియమించారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాలతో ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి అడ్డుకట్టపడింది. పైగా ఆబోర్డులో ఆరుగురు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సభ్యులుగా ఉన్నారంటూ అప్పట్లో బీజేపీ కోర్టును కూడా ఆశ్రయించింది. అపార్టుమెంట్ల పేరుతో ప్రజలను మోసం చేశారంటూ ఆబోర్డులో సభ్యుడిగా ఉన్న లక్ష్మీనారాయణను అరెస్ట్ కూడా చేశారు. మరోవైపు మూడవ బోర్డుకు భూమన కరుణాకర్‌రెడ్డితో సహా 26 మందిని నియమించారు. ఈ పాలకమండలి నిర్ణయాలన్నీ వివాదాస్పదమే అయ్యాయి. రాజకీయలబ్ధి కోసం టీటీడీ నిధులతో తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు, అవసరం లేకపోయిన విశ్రాంతి గృహాల నిర్మాణం వంటివి విమర్శలకు గురయ్యాయి.

9న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీన పుష్పయాగం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఈమేరకు 8వ తేదీన రాత్రి 8 నుంచి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. ఈసేవ కారణంగా 8న సహస్రదీపాలంకార సేవ, 9న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యతతో కూడిన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రుయా, స్విమ్స్, బర్డ్, మెటర్నటీ, అశ్విని ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చికిత్స అందించాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రామ్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోక్‌వర్ధన్, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ కుసుమకుమారి, డీఐవో డాక్టర్ శాంతకుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ మేనేజర్ శివకుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ గ్యారేజీ ముందు బుధవారం నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించనున్నారు. దీంతో తిరుపతి- కాణిపాకానికి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, తిరుపతి- సత్యవేడు మధ్య పల్లెవెలుగు సర్వీసు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ మూడు అద్దె సర్వీసులేనని డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 74,651 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,712 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పాకాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాకాలచమండలంలోని చంద్రగిరివారిపల్లె, ఎస్టీ కాలనీ వరదప్పనాయుడుపేట, వల్లివేడు, ఈపాలగుట్టపల్లె గ్రామాల పరిసరాల్లో సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. మామిడి, పనస చెట్లు విరిచేశాయి. పైపులైన్లు ధ్వంసం చేశాయి. రాత్రి గ్రామాల నుంచి బయటికి రావాలంటే ఏనుగుల మంద దాడి చేస్తుందేమోనని భయంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. వీటి బారినుండి రక్షించి తమకు పంటనష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



తిరుమల రెండో ఘాట్‌రోడ్డు పక్కన ఉన్న ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్, గుట్కా ప్యాకెట్లు



ఇదేంది స్వామి!

తిరుమలకు మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, గుట్కా, హన్స్ వంటివి నిషేధం. వీటిని అలిపిరి భద్రత తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. కానీ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ తిరుమలకు నిషేధిత వస్తువులు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో వినాయక స్వామి ఆలయం దాటాక వచ్చే షెడ్డుకు సమీపంలో ఇలా తాగి పడేసిన మద్యం సీసాలు, వాడేసిన గుట్కా, హన్స్, సిగరెట్ ప్యాకెట్లు భారీగా పడున్నాయి. ఒకే ప్రాంతంలో పోగేసినట్టుగా ఉన్న వీటిని చూసి భక్తులు విస్మయం చెందుతున్నారు. భక్తుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెద్దశేషవాహనంపై మలయప్ప

నాగుల చవితి సందర్భంగా మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి పెద్దశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. విశేష అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అమానవీయ రాజకీయం

బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ

పరామర్శల పేరుతో హడావుడి - వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం

ఎన్నికల్లో ఘోరంగా అధికారం కోల్పోయిన జగన్ పార్టీ అత్యాచార రాజకీయాలకు తెర లేపింది. ఎర్రావారిపాళెం మండలంలో సోమవారం రాత్రి జరిగిన ఒక సంఘటనపై నానా యాగీ చేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా 14 ఏళ్ల బాలిక భవిష్యత్తును రచ్చకెక్కించేందుకు తెగబడింది. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించే పేరుతో నాయకులంతా క్యూకట్టారు. హడావుడి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విఫలమైపోయిందంటూ వీరంగాలు వేశారు. చివరికి పదో తరగతి చదువుతున్న బాలిక తండ్రి చేతులు జోడించి..' నా బిడ్డమీద ఎటువంటి అత్యాచారం జరగలేదు. నా బిడ్డ భవిష్యత్తును పాడు చేయద్దు స్వాములాలా' అని కన్నీటితో వేడుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నా బిడ్డపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేధింపులకు మాత్రమే పాల్పడ్డారు. అయితే మీడియాలో, కొందరు రాజకీయ నేతలూ నా బిడ్డపై అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ మా పరువు తీస్తున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా బిడ్డ భవిష్యత్తును నాశనం చేయకండి.


- బాలిక తండ్రి



అత్యాచారం అబద్ధం: ఎస్పీ

14 ఏళ్ల విద్యార్థినిపై ఎటువంటి అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షల్లో వైద్యులు స్పష్టంగా నిర్ధారించారు. పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకొని ప్రేమించాలని వేధింపులకు పాల్పడ్డారు. కొన్ని పత్రికల్లో రాసినట్లు, కొందరు నేతలు పేర్కొంటున్నట్లు బాలికపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. ఇటువంటి సున్నితమైన విషయాల గురించి మాట్లాడే ముందు నిజనిజాలు పూర్తిగా తెలుసుకోవాలి. మీడియా కూడా ఎలాంటి ఆధారాలు, అధికారుల వివరణ లేకుండా అసత్యాలు ప్రసారం చేయడం మంచిది కాదు.బాలికను వేధింపులకు గురిచేసిన వారిని తప్పక అదుపులోకి తీసుకొని తగు చర్యలు చేపడతాం.

- సుబ్బారాయుడు, జిల్లా ఎస్పీ



మీకు మానవత్వం లేదా: పులివర్తి నాని

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అక్కడ వైసీపీ నేతల తీరును దుయ్యబట్టారు. పబ్లిసిటీ కోసం వైసీపీ సోషల్ మీడియాతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మానవత్వం లేకుండా బాలిక విషయంలో అసత్యాలను ప్రచారం చేయించారని ఆరోపించారు. ఉదయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్, మంత్రి లోకేష్ ఫోన్ చేస్తూ ఎప్పటికప్పుడు బాలిక పరిస్థితి, వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై తప్పక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఆస్పత్రి వద్ద వైసీపీ నేతల హల్‌చల్

ప్రసూతి ఆసుపత్రికి ఉదయమే పులివర్తి సుధారెడ్డి చేరుకొని మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి బాలికను పరామర్శించి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని పోలీసులు ఆస్పత్రిలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. సాధారణంగా మగవారిని ప్రసూతి ఆస్పత్రిలోకి అనుమతించరు. దీంతో వారు ఆస్పత్రి ముందు బైఠాయించారు. బాలికను పరామర్శించి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి రోజా తన సహజ ధోరణిలో ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.





ప్రసూతి ఆస్పత్రి ముందు బైఠాయించిన వైసీపీ నేతలు, మీడియాతో మాట్లాడుతున్న రోజా

కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీటు కేటాయింపు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: యర్రావారిపాళెం మండలంలో దాడికి గురైన బాలిక.. తదుపరి విద్యను కొనసాగించేందుకు అక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సీటు కేటాయించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె చదువు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.



ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ విష్ణు

పుత్తూరు కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడు బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

మరో పౌరసరఫరాల శాఖ అధికారి కూడా

5,040 బస్తాల అమ్మకంతో రూ.29.70 లక్షల ఆర్జన

పుత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా తరలించిన సీఎస్‌డీటీ సీహెచ్ విష్ణు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం పట్టుబడిన ఇతడిని మంగళవారం రిమాండ్ నిమిత్తం పుత్తూరులోని ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. పుత్తూరు ఎస్డీపీవో రవికుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించనున్నట్లు సీఐ కె.వి.సురేంద్రనాయుడు తెలిపారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో సీఎస్‌డీటీగా సీహెచ్ విష్ణు 2022 డిసెంబరు నుంచి 2024 ఆగస్టు వరకు విధులు నిర్వహించాడన్నారు. గోడౌన్ల నుంచి సుమారు 4,056 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించామన్నారు. ఉద్యోగ బాధ్యతలను విస్మరించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టాడనే నేరారోపణలపై అరెస్టు చేశామన్నారు. ఆహార భద్రతా చట్టం -1955 అండర్ సెక్షన్ 314, 316, 316(5), 318(4), 7(1) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమాల్లో బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడుకు చెందిన కొందరు బియ్యం వ్యాపారులతో పాటు పౌరసరఫరాల శాఖకు చెందిన మరో అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,840 బియ్యం బస్తాలు విక్రయించి రూ.14.90 లక్షలు, పిచ్చాటూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,200 బస్తాలు విక్రయించి రూ.14.80 లక్షలు అక్రమంగా ఆర్జించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అప్పులకు.. విలాసాలకు..

ఈ అక్రమ సంపాదనను సీఎస్‌డీటీ విష్ణు తాను చేసిన అప్పులకు గాను నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి రూ.14 లక్షలు, పాపిరెడ్డికి రూ.1.50 లక్షలు, గూడూరుకు చెందిన రమణరాజుకు రూ.1.50 లక్షలు, చెన్నైకి చెందిన మరికొందరి నగదు రూపంలో చెల్లించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు తెలిసింది. ఇక, విలాసాలకు ఖర్చు చేసిన మొత్తం ఎంతనేది లెక్క తేలలేదని పోలీసులు అంటున్నారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని తన సొంతూరు రాజుపాళెంలో ఒక ఇల్లు, రెండు రేకుల షెడ్లు, బైక్ ఉందని, తన తల్లి పేరున ఎకరా మామిడి తోట ఉన్నట్లు విచారణలో విష్ణు చెప్పినట్లు సమాచారం.

కత్తితో ఆటో డ్రైవరు వీరంగం

స్నేహితుడి కుటుంబంపై దాడితో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తిలో కలకలం



చికిత్స పొందుతున్న సతీష్, గణేష్



చికిత్స పొందుతున్న కీర్తన

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ కత్తితో విచక్షణా రహితంగా రెచ్చిపోయాడు. వేకువ జామున 4 గంటల సమయంలో స్నేహితుడి ఇంటికెళ్లి హత్యాయత్నానికి తెగబడ్డాడు. అడ్డుకున్న అతడి భార్య, మామనూ గాయపరిచాడు. రక్తం కారుతుండగా ముగ్గురూ పోలీసు స్టేషనుకు పరుగు తీశారు. తెల్లారేసరికి పట్టణ ప్రధాన రహదారిలో కనిపించిన రక్తపు మరకలతో శ్రీకాళహస్తిలో కలకలం రేగింది.

పట్టణంలోని జెట్టిపాళేనికి చెందిన సతీష్, ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన మణి ఆటో డ్రైవర్లు. వీరిద్దరూ స్నేహితులు. మద్యంమత్తులో తరచూ వాగ్వాదం చోటు చేసుకునేది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ గుడి వీధిలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువన నాలుగున్నర గంటల సమయంలో కత్తి చేత పట్టుకున్న మణి.. జెట్టిపాళెంలోని సతీష్ ఇంటికెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో దాడి చేశాడు. అరుపులు విన్న కీర్తన.. తన భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెపైనా నిందితుడు కత్తితో దాడి చేశాడు. కీర్తన తండ్రి గణేష్ వచ్చి మణిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా, అతడిపైనా దాడి చేశాడు. దీంతో రక్తం కారుతుండా ముగ్గురూ జెట్టిపాళెం నుంచి పెళ్లి మండపం మీదుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పరుగుతీశారు. వెంటనే వీరిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కు పొట్ట పైన, కీర్తనకు నడుము కింద, గణేష్‌కు చేతిపైన కత్తిపోట్లతో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మణి కోసం గాలిస్తున్నారు. బాధితులు పరుగు తీసిన రోడ్డంతా రక్తపు మరకలయ్యాయి.



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతూ తిరుపతిలో భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ఘన స్వాగతం

తిరుపతిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అభిమానులు వినూత్నరీతిలో స్వాగతం పలికారు. రాజమండ్రికి చెందిన ఆయనకు కోనేరు మురళి, తూర్పుగోదావరి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్ నేతృత్వంలో రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరివరకు.. అక్కడ్నుంచి ఆయన ఇంటి వరకు దారిపొడవునా పెద్దఎత్తున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికారు. అలాగే, తిరుపతిలోని ఆయన నివాసం వరకూ ఫ్లెక్సీలు, బ్యానర్లను కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి



తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యసంరక్షణ కోసం బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించి స్వీయ పరీక్ష పోస్టర్‌ని మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ, పరివర్తన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు స్వీయ పరీక్ష చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలతోపాటు చికిత్స పొందాలని తెలిపారు. సి.హేయ్, పరివర్తన సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దీనిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు సాయి ధరమ్‌తేజ్

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ మంగళవారం రాత్రి 11 గంటలకు తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకను వచ్చిన ఆయనకు జీఎన్సీ వద్ద స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఫీనిక్స్ అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. బుధవారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్‌నకు 13 నుంచి ఇంటర్వ్యూలు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల అభ్యర్థులకు 15న ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ మేరకు ఇన్‌చార్జి డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూ కోసం రెజ్యూమ్, ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, 10వ తరగతి, ఐటీఐ మార్కులలిస్టులు, కులధృవీకరణ పత్రం, వికలాంగులు, మాజీ సైనికుల పిల్లలైతే ఆచా సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కు సంబంధించిన ధృవీకరణపత్రం, ఆధార్, అన్ని ఒరిజినల్స్ తీసుకు రావాలని పేర్కొన్నారు. నెల్లూరు సమీపంలోని కాకుటూరులో ఉన్న ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలకు హాజరు కావాల్సి ఉంది.

శిల్పారామంలో సీఈవో తనిఖీ



శిల్పారామంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఈవో స్వామినాయుడు

తిరుచానూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శిల్పారామాన్ని మంగళవారం ఏపీ రాష్ట్ర శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రమాదం జరిగిన ప్రదేశంపై ఆరాతీసి, ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన క్రాస్‌వీల్, జాయింట్ వీల్, లిఫ్ట్ మగ్రమెంట్ అనుమతులు రద్దుచేయాలని ఆదేశించారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రమాదాలకు అవకాశాలు లేనివాటిని మాత్రమే అనుమతించాలని, ల్యాండ్ స్కేపింగ్‌ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని శిల్పారామాలకు ఇదే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. శిల్పారామం అభివృద్ధికి కావాల్సిన అనుమతులకోసం వెంటనే నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఏవో, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు వస్తే పాజిటివ్ ఫీలింగ్



అనన్య నాగళ్ల

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ఎప్పుడు వచ్చినా మంచి పాజిటివ్ ఫీలింగ్ వస్తుందని సినీనటి అనన్య నాగళ్ల అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పొట్టేల్' చిత్రం తనకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. త్వరలో మంచి ప్రాజెక్టులు చేయనున్న క్రమంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.

ఎనిమిది అడుగుల జెర్రిపోతు



తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ గార్డెన్‌లోని ఓ గదిలోకి మంగళవారం సుమారు ఎనిమిది అడుగుల జెర్రిపోతు చొరబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకోవడంతో అక్కడివారు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే రింగురోడ్డులోని డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ వద్ద మరో నాలుగు అడుగుల పొడవైన నాగుపామును కూడా భాస్కర్ పట్టుకున్నారు. ఈ రెండింటినీ దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందుకున్న వారు కూటమి ప్రభుత్వం పట్ల కృతజ్ఞత చూపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని నిర్వీర్యం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గ పరిధిలో 9మందికి రూ.10.63 లక్షల ఆర్థిక సాయాన్ని అందించామని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ పరిధిలో పలువురికి రూ.9కోట్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, ఇశ్రాయిల్ కుమార్, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరావు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సుధా అనే మహిళకు మూడు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఆర్‌డీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఏపీఆర్‌డీ రాష్ట్ర కోఆర్డినేటర్ శిల్పా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చియాంగ్ మై వర్సిటీతో ఆదిశంకర ఎంవోయూ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మై వర్సిటీతో స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెంచలయ్య థాయ్‌లాండ్ వెళ్లి చియాంగ్ మై వర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధన, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర అంశాల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పెంచలయ్య తెలిపారు. అంతర్జాతీయ ప్రయాణాలు కలిగిన చియాంగ్ మై వర్సిటీతో ఒప్పందం వల్ల ఆదిశంకర విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధనకు ఎంతో ఉపకరిస్తుందన్నారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గ్రామసభ

కోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాల్లో భూముల రీసర్వేపై మంగళవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. రీ సర్వేలో పొరపాట్లను అధికారులు పరిష్కరించారు.

వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం: రాంకుమార్

వెంకటగిరి టౌన్, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు గుర్తించుకుని కార్యకర్తలు, నాయకులను కలుపుకుని పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీసీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని కట్టకాలనీ వద్ద లక్ష్మీప్రియ(18) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. కట్టకాలనీలో నివసిస్తున్న లక్ష్మీప్రియ కొంతకాలంగా ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. నాలుగు రోజుల క్రితం సూపర్‌మార్కెట్‌లో నగదు తేడా రావడంతో లక్ష్మీప్రియ తీసుకుందని నిందించారు. ఆమె తల్లిదండ్రులు సూపర్‌మార్కెట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని లక్ష్మీప్రియ మృతి చెంది ఉండడాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

84 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 84మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడులో మంగళవారం దాడులు నిర్వహించగా అంకమ్మ అనే మహిళ 30 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణ పరిధిలోని పాత వెంకటగిరి రోడ్డులో విజయమ్మ అనే మహిళ నుంచి 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మోటరు సైక్లిస్టుకు తీవ్రగాయాలు

నాయుడుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బిట్రగుంటకు చెందిన ప్రేమ్‌కుమార్ మోటరు సైకిల్‌పై బెంగళూరుకు వెళ్తుండగా నాయుడుపేట సమీపంలోకి ట్రాక్టర్ ఢీ కొందది. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తీసుకెళ్లారు.

మినీ గోకులాలకు భూమిపూజ

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో మినీ గోకులానికి మంగళవారం భూమిపూజ జరిగింది. టీడీపీ నాయకులు రఘురామయ్య, కృష్ణ, శ్రీనివాసులు, పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి మినీ గోకులాల పనులను ప్రారంభించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

స్వర్ణముఖి నదిలో నీటమునిగి పదో తరగతి విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చిన్నబలరామయ్య



వీరేందర్ సాయి (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకెళ్లిన విద్యార్థి నీట మునిగి మృత్యువాత పడిన ఘటన చిట్టమూరు మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం, విద్యానగర్ ప్రకాష్ కాలనీకి చెందిన సాయి, రాధా దంపతుల కుమారుడు వీరేందర్ సాయి(15) చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తోటి విద్యార్థులు అంకయ్య, వంశీ, అప్పీతో కలిసి వీరేందర్ సాయి మెట్టు సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరేందర్ సాయి, వంశీ ఇసుక ఊబిలో మునిగిపోతుండడంతో అంకయ్య అప్రమత్తమై వంశీని గట్టుకు లాక్కొచ్చాడు. ఇంతలో వీరేందర్ సాయి నీట మునిగిపోయాడు. దీంతో భయపడిన అంకయ్య, వంశీ, అప్పీ అక్కడ నుంచి వెళ్లిపోతూ వీరేందర్ సాయి బట్టలను ఇసుకలో పాతిపెట్టారు. పుస్తకాల బ్యాగ్‌ను ఊరిబయట కంపచెట్లలో పడేశారు. చీకటి పడుతున్నా కుమారుడు ఇంటికి రాకపోవడంతో వీరేందర్ సాయి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరా తీసినప్పటికీ విద్యార్థులు ఎవరూ చెప్పలేదు. మంగళవారం ఉదయం వీరేందర్ సాయి తల్లిదండ్రులు ముగ్గురు విద్యార్థులనూ బతిమలాడగా జరిగిన సంఘటన గురించి వంశీ వివరించాడు. ఈతకు వెళ్లిన చోట గాలించగా వీరేందర్ సాయి మృతదేహం లభ్యమైంది. పోలీసులు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీరేందర్ సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఇసుక గోతులే విద్యార్థి ప్రాణం తీశాయ్

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీకి ఆనవాళ్లుగా మిగిలిన గోతులే విద్యార్థి ప్రాణాలను బలిగొన్నాయని మెట్టు గ్రామస్తులు ఆరోపించారు. స్వర్ణముఖి నదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గోతుల్లో వీరేందర్ సాయి ఇరుక్కుపోవడం వల్లే మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు.

దిగ్ర్భాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

స్వర్ణముఖిలో ఈతకెళ్లిన విద్యార్థి వీరేందర్ సాయి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. వీరేందర్ సాయి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.పది వేల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు టీడీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, శ్రావణ్ తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోవద్దు

తడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, సునామీల వంటి విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోకూడదని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. మంగళవారం భీములవారిపాళెం సచివాలయం వద్ద ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ తుఫాన్లు, సునామీ వంటి విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి 9వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మల్లికార్జున, గృహనిర్మాణశాఖ ఏఈ సత్యనారాయణ, అటవీశాఖ రేంజర్ సౌజన్య, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



మనిషిపై చెట్టుకూలిపోయిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

తూపిలిపాళెంలో సునామీపై మాక్‌డ్రిల్

వాకాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపిలిపాళెంలో మంగళవారం తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. సునామి సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్‌ఐ నాగబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పశుసంవర్ధకశాఖ వైద్యులు రమణయ్య, కృష్ణారావు, గ్రామస్థులు వెంకటరమణయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



చిల్లకూరులో తెలుగుగంగ కార్యాలయం వద్ద పుట్టకు పూజలు

గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి టౌన్, ఓజిలి, నాయుడుపేట టౌన్, తడ, కోట, సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు కోర్టు ఆవరణ, విఘ్నేశ్వరపురం ప్రాంతాల్లోని నాగులపుట్ట వద్ద, శివాలయం, కోదండరామాంజనేయస్వామి ఆలయాల్లోని నాగశిలలకు పూజలు చేశారు. ● చిల్లకూరు తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పుట్ట, శంకరన్ గిజనకాలనీలోని పుట్ట, సమీప పొలాల్లోని పుట్టల వద్ద పూజలు చేశారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయం, కౌవల్యా నది ఒడ్డున ఉన్న నాగమందిరం పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు. ● ఓజిలి, కురుగొండ, మానమాల, వెంకటరెడ్డిపాళెం గ్రామాల సమీపంలోని పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. ● నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న పుట్ట, స్వర్ణముఖినది తీరాన, విన్నమాల దగ్గర ఉన్న పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. ● తడ మండలంలో గ్రామాల్లోని పుట్టలను పూలతో అలంకరించారు. పాలు, కోడిగుడ్లు, జొన్నలు, సజ్జలు స్వామివారికి నైవేద్యాలుగా సమర్పించారు. ● కోట మండల పరిధిలోని గూడలి, కేశవరం, చిట్టేడు, మద్దాలి, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, కోట, విద్యానగర్‌లో మహిళలు నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకున్నారు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లను వేసి మొక్కులు తీర్చుకున్నారు. ● సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం వద్దనున్న పుట్ట, కేఆర్‌పాలెం వద్దనున్న సాయిబాబా ఆలయం, మన్నారుపోలూరు రోడ్డులో ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గూడూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అభినందించారు. కార్యక్రమంలో మునిగిరీష్, శివకుమార్, జలీల్, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులకు అడ్డంకులు తొలగించండి

పెళ్లకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి నిర్మాణ పనులకు అడ్డంకులు త్వరితగతిన తొలగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెళ్లకూరు మండల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నష్ట పరిహారం చెల్లింపు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా తాళ్వాయిపాడు, చావాలి చిల్లకూరు గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ యువరాజు, ఆర్‌ఐ సంతోషీబాయి, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, తేజ, కల్యాణి, మోబీనా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

దామానెల్లూరులో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరులో మంగళవారం స్విమ్స్, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో పేర్నాడు పీహెచ్‌సీ వైద్యాధికారి రమణయ్య, సర్పంచు వి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

పోలేరమ్మకు పొంగళ్లు

ఓజిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లకనుపూరులో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు అంబలి పొంగళ్లు పెట్టారు. ఈ నెల 8వ తేదీనుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు అమ్మవారికి గ్రామ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తుడు బచ్చల రవీంద్రారెడ్డి తెలిపారు.